16 నుంచి డిగ్రీ 2,4, 6 సెమిస్టర్

కర్నూలు(అర్బన్), మే 10: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ 2, 4వ సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ, 6వ సెమిస్టర్, డిగ్రీ స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 16 నుంచి జరుగుతాయని పరీక్షల విభాగం కంట్రోలర్ ఎన్. వెంకటేశ్వర్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన టైమ్ టేబుల్, హాల్ టికెట్లు, కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు పంపించామని తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో హాల్ టికెట్లు తీసుకుని పరీక్షా కేంద్రాలకు అరగంట ముందు చేరుకోవాలని సూచించారు.



నంద్యాల, మే 10 (ఆంధ్రజ్యోతి):

సార్వత్రిక ఎన్నికలు మరో రెండు రోజుల్లో జరగనున్నాయి. ఐదేళ్ల పథకాలను ఊదరగొడుతూ వైసీపీ నాయకులు భారీగా ప్రచారం నిర్వహించారు. అయితే అవేమీ ఓటర్లలో వైసీపీ పట్ల అభిమానాన్ని పెంచలేదు. ప్రజల్లో పెరిగిపోయిన వ్యతిరేకత తగ్గించేందుకు తమ శక్తి చాలకపోవడంతో వైసీపీ నాయకులు డబ్బు ఎర చూపుతున్నారు. అది కూడా బహిరంగంగానే ఇవ్వడం మొదలుపెట్టారు. ఒక్కో ఓటుకు రూ.2 వేలు నిర్ణయించి ఓటర్లకు ఇస్తున్నారు. ఇంత తతంగం జరుగుతున్నా పోలీసులు ఆ వైపు కన్నెత్తి చూడడం లేదు. అయితే డబ్బులు తీసుకున్నా ఓటర్లు టీడీపీకే ఓటు వేసేందుకు ఆసక్తి చూపడంతో ఏం చేయాలో పాలుపోని స్థితిలో అధికార పార్టీ నేతలు ఉన్నారు.



ఇక పంపకాలు..!

- ఓటుకు రెండు వేల చొప్పున ఇస్తున్న వైసీపీ
- ఇప్పటికే పంచడం పని దాదాపుగా పూర్తి
- ఆ వైపు తొంగి చూడని పోలీసులు
- ఓట్లను కొనే పనిలో అధికార పార్టీ నాయకులు

రూ.కోట్లకు వెనుకాడని వైనం..

ఒకపుడు ఎన్నికలంటే.. ప్రజలకు ఫలానా మేలు చేస్తాం. నియోజకవర్గాన్ని ఇలా అభివృద్ధి చేస్తాం' అని నేతలు ప్రచారం చేసుకొనేవారు. అయితే ప్రస్తుత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఎన్నికల హడావుడి మొదలైనప్పటి నుంచి ప్రతిదీ డబ్బుతో కూడుకున్న పనే! ప్రజల ఆలోచన సరళి కూడా మారిపోయింది. ఐదేళ్లు దోచుకునే నేత ఎన్నికల ముందు తమ వద్దకు రాగానే.. ఇప్పుడు తప్ప మళ్లీ డబ్బులు రాల్చడని డబ్బు ఇస్తేనే ఓటు వేస్తామని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. వైసీపీ ఎన్నికల ముఖచిత్రంపైకి వచ్చిన తర్వాత ఆ ఖర్చు మరింత ఎక్కువైందన్న అభిప్రాయం వినిపిస్తోంది. టికెట్ తెచ్చుకునేందుకు పార్టీకి ఫండ్ సమర్పించుకోవాలి. ఆ తర్వాత ఇతర ఖర్చులు ఉంటాయి. చివరిగా ఓటర్లకు డబ్బులు ఇచ్చుకోవాలి. ఇవన్నీ కలిసి అభ్యర్థికి భారీగా ఖర్చు వస్తోంది. నియోజకవర్గంలో ఒక్కో ఓటుకు రూ.2 వేలు పంచాలని నాయకులకు అధికార పార్టీ ఆదేశం వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఒక్క శ్రీశైలం నియోజకవర్గం మినహా అన్ని చోట్ల రెండు లక్షలకు పైగానే ఓటర్లున్నారు. నంద్యాల నియోజకవర్గంలో 2.73 లక్షల ఓటర్లున్నారు. ఈ లెక్కన ఓటర్లకు పంచేందుకే రూ.40-50 కోట్లకు పైగానే ఖర్చు అవుతుందని అంచనా! ఇక పార్టీ ఫండ్ మిగతా అన్ని ఖర్చులు కలిపి మరో రూ.25 వరకు అవుతుందన్నది ఆయా నేతల నుంచి వినవస్తున్న అభిప్రాయం. ఇంత భారీ స్థాయిలో లెక్క పెట్టాల్సి వస్తున్నా వైసీపీ నాయకులు ఏమాత్రం వెనుకడుగు వేయడం లేదు. గెలిస్తే మళ్లీ ఐదేళ్ల పాటు పెట్టిన ఖర్చుకు రెండింతలు సంపాదించవచ్చన్న ఆలోచనతో వైసీపీ నాయకులు డబ్బు మంచినీళ్ల ప్రాయంగా ఖర్చు చేస్తున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది.



అనుకూలంగా ఉంటే ఓ రేటు..

జిల్లాలో వైసీపీ నేతలు డబ్బులు పంచే తీరు అక్కడ ప్రభావాన్ని బట్టి మారుతోందన్న అభిప్రాయం వినిపిస్తోంది. తమకు ఓట్లు పడవు అనుకున్న చోట్ల రూ.2 వేలు ఇస్తుండగా, తమ వర్గం వారు ఉన్న చోట, పల్లెల్లో ఓ రూ.500 తక్కువగా పంచుతున్నట్లు తెలుస్తోంది. ఇక దీనికి తోడు ఓటింగ్‌కు రెండ్రోజుల ముందు నుంచి మద్యం దొరికే అవకాశం ఉండదు కాబట్టి ఆ రోజుల్లో మందు బాబులకు క్వార్టర్ బాటిళ్లు ఇచ్చేందుకు వైసీపీ నేతలు సిద్ధమైపోయారు. ఇప్పటికే ఆయా నియోకవర్గాలకు అవసరమైన మేర ఇతర రాష్ట్రాల మద్యాన్ని దింపి డంప్ చేసుకున్నట్లు తెలుస్తోంది. దీనికి తోడు ఆయా ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి కూడా భారీగానే మద్యాన్ని ముందుగానే అధికార పార్టీ నేతలు తరలించుకున్నట్లు తెలుస్తోంది. ఇన్నాళ్లు తమ మీద ఉన్న వ్యతిరేకత ప్రజలకు గుర్తు రాకుండా, ఈ ఎన్నికలు రెండ్రోజులు వైసీపీ నేతలు జిల్లా వ్యాప్తంగా డబ్బు విచ్చలవిడిగా వెదజల్లి, మద్యాన్ని పారించి ఎన్నికల్లో గెలుపొందాలన్న ఉద్దేశంతో వ్యవహరిస్తున్నారన్న విమర్శలు అన్ని వైపుల నుంచి వినిపిస్తున్నాయి.

పంచేశారా..?


ఒక్కో ఓటుకు రేటు ఇప్పటికే నిర్ణయించిన అధికార పార్టీ, నియోజకవర్గాల్లో ఆ డబ్బు సాధ్యమైనంత ఎక్కువ మందికి చేరేలా చూడాలని కూడా ఆదేశించినట్లు తెలుస్తోంది. ఇక డబ్బు పంచేందుకు లోకల్ వారైతే డబ్బు పంపిణీ సరిగా జరగదని, అధికార పార్టీ నేతల బంధువులు బయట నుంచి దిగిపోయారు. ఓటరు స్లిప్పులు చూసి ఎక్కడికక్కడ డబ్బులు పంచారు. సదరు స్లిప్పు చూపించిన వ్యక్తి సరైన ఓటరు అవునో కాదో తెలుసుకునేందుకు వైసీపీ నేతలు కొంతమంది వలంటీరు, సచివాలయ ఉద్యోగులు సహాయాన్ని తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇలా ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఆయా ప్రాంతాల్లో డబ్బు పంపిణీ దాదాపు పూర్తి అయిందని తెలుస్తోంది. ఈ డబ్బు పంపిణీ పోలీసులకు తెలిసే జరుగుతోందన్న విమర్శలు అన్ని వైపుల నుంచి వినిపిస్తున్నాయి. వైసీపీ నేతల డబ్బు పంపిణీ గురించి పట్టించుకోకుండా ఉండేందుకు పోలీసు స్టేషను స్థాయిని బట్టి రూ.10 నుంచి రూ.15 లక్షలు అందించారని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ కారణంగానే పోలీసులు వైసీపీ నేతలు డబ్బులు పంచే వైపు కనీసం తొంగిచూడటం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎన్నికల్లో డబ్బు ప్రభావాన్ని ఆపేస్తామని ఈసీ చెబుతున్నా, వైసీపీ చేస్తున్న డబ్బు పంపిణీని చూస్తుంటే అవన్నీ డొల్ల మాటలేనన్న అభిప్రాయం వినిపిస్తోంది.

● కప్పదాటు నేతలకు ప్యాకేజీలు..

ఎన్నికలనగానే పార్టీల ద్వితీయ శ్రేణి నేతలు కప్పదాట్ల ప్రదర్శనలు చేస్తుంటారు. అధికార పార్టీ నుంచి టీడీపీలోకి ఈ చేరికలు ఎక్కువగా ఉన్నాయి. ఐదేళ్ల పాలనలో కింది స్థాయి వైసీపీ నేతలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇక మళ్లీ టీడీపీ ప్రభుత్వం రాబోతోందన్న అంచనాతో వారంతా టీడీపీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. బనగానపల్లె లాంటి నియోజకవర్గంలోని చాలా గ్రామాల్లో వైసీపీ పూర్తిగా తుడిచి పెట్టుకుపోయిన ఘటనలు ఉన్నాయి. మిగతా నియోజకవర్గాల్లో కూడా ఇదే పరిస్థితి. అయితే పార్టీని వీడొద్దంటూ కిందిస్థాయి నాయకులను వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు కాళ్లు, గడ్డాలు పట్టుకుని బతిమిలాడే పరిస్థితి. అయినా వినకపోవడంతో వారికి రేటు కట్టే పనికి పూనుకున్నారు. గ్రామ సర్పంచులకు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలు, ఇక పట్టణాల్లో కౌన్సిలర్లకు కూడా ఇదే స్థాయిలో ఇచ్చి పార్టీని వీడనివ్వటం లేదు. ఓటర్లను ఎక్కువగా ప్రభావితం చేయగలిగే నాయకులకు ఇంతకంటే ఎక్కువ స్థాయిలో డబ్బు ఎర జూపుతున్నారన్న ప్రచారం జరుగుతోంది.



నేడు నంద్యాలకు చంద్రబాబు



నంద్యాల (నూనెపల్లె), మే 10: టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం నంద్యాలకు రానున్నారు. సార్వత్రిక ఎన్నికల పర్యటనలో భాగంగా శనివారం ఒంగోలులో పర్యటన ముగించుకుని మధ్యాహ్నం 12.15 గంటలకు నంద్యాలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. రోడ్డు మార్గంలో బయలుదేరి స్థానిక రాజ్ థియేటర్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన ప్రజా గళం బహిరంగ సభలో ప్రసంగిస్తారు. 12.30 నుంచి 1.30 వరకు జరిగే బహిరంగ సభ అనంతరం హెలిప్యాడ్‌కు చేరుకుని 1.55కు చిత్తూరుకు బయలు దేరనున్నారు. గత ఏడాది నంద్యాలలోని రాజ్ థియేటర్ సర్కిల్‌లో బహిరంగ సభ అనంతరం ఓ ఫంక్షన్ హాల్‌లో చంద్రబాబు నాయుడు బస చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో సీఐడీ అధికారులు సెప్టెంబరు 9వ తేదీ తెల్లవారు జామున ఆయనను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఏడు నెలల తర్వాత చంద్రబాబు ఎన్నికల ప్రచారం నిమిత్తం శనివారం నంద్యాలకు రావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

వైసీపీలో భగ్గుమన్న విభేదాలు

- మైకు ఇవ్వలేదని ఓ వర్గం మనస్థాపం
- ప్రచారం రథం దిగి వెళ్లిపోయిన వైనం



కాటసాని రామిరెడ్డి



చల్లా విఘ్నేశ్వర్‌రెడ్డి

అవుకు, మే 10: అవుకు వైసీపీలో వర్గ విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. శుక్రవారం కాటసాని రామిరెడ్డి నిర్వహించిన రోడ్‌షో నుంచి చల్లా విఘ్నేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ చల్లా రాజశేఖర్‌రెడ్డిలు వెళ్లిపోవడం చర్చనీయాంశంగా మారింది. చల్లా కుటుంబం రెండు వర్గాలుగా విడిపోయిన విషయం తెలిసిందే. చల్లా రామకృష్ణారెడ్డి సోదరుడు చల్లా సూర్యప్రకాశ్‌రెడ్డి, చల్లా రాజశేఖర్‌రెడ్డి, కుమారుడు విఘ్నేశ్వర్‌రెడ్డి, చల్లా రఘునాథరెడ్డి, పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డిలు ఒక వర్గంగా ఉన్నారు. చల్లా ప్రభాకర్‌రెడ్డి కుమారుడు చల్లా విక్రాంత్‌రెడ్డి, దుగ్గిరెడ్డి రవీంద్రనాథరెడ్డి మరో వర్గంగా ఏర్పడ్డారు. ఈ రెండు వర్గాలు కాటసానికే మద్దతు ఇస్తున్నాయి. ఎన్నికల ప్రచారంలో భాగంగా కాటసాని రామిరెడ్డి, ఎంపీ అభ్యర్థి పోచా బ్రహ్మానందరెడ్డి, చల్లా విఘ్నేశ్వర్‌రెడ్డి, చల్లా రాజశేఖర్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, చల్లా విక్రాంత్‌రెడ్డి, రవీంద్రనాథరెడ్డితో కలిసి అవుకు పట్టణంలో రోడ్‌షో నిర్వహించారు. ప్రచార రథం రాజ వీధి సర్కిల్‌కు చేరుకున్న అనంతరం చల్లా రాజశేఖర్‌రెడ్డి ప్రసంగించారు. ఆ తరువాత మైక్‌ను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి చేతికి ఇచ్చాడు. అయితే ఓబుల్‌రెడ్డి మైక్ తీసుకొని చల్లా ప్రభాకర్‌రెడ్డి కుమారుడు చల్లా విక్రాంత్‌రెడ్డికి ఇచ్చారు. అయితే మైకు తమకు ఇవ్వలేదన్న కోపంతో చల్లా విఘ్నేశ్వర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ప్రచార రథం దిగి తమ అనుచరులతో కలిసి మీటింగ్‌ను బాయ్‌కాట్ చేసి వెళ్లిపోయారు. కాటసాని రామిరెడ్డి, పోచా బ్రహ్మానందరెడ్డిలు చల్లా కుటుంబీకులతో చర్చలకు వెళ్లినా మాట్లాడానికి నిరాకరించారు. శనివారం చల్లా ఫాంహౌస్‌లో నిర్వహించే ఆత్మీయ సమావేశానికి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి రావాలని చల్లా విఘ్నేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. తాను ఏమిటో చూపిస్తామని చల్లా విఘ్నేశ్వర్‌రెడ్డి అనడం కొసమెరుపు. రెండు రోజుల్లో పోలింగ్ జరగనున్న నేపథ్యంలో ఈ ఘటన దేనికి దారి తీస్తుందోనన్న ఆందోళన అధికార పార్టీలో మొదలైంది.

బురద నీటితో చేపలు మృతి

రూ.12 లక్షల నష్టం



చేపలను చూపుతున్న మత్స్యకారులు

రుద్రవరం, మే 10 : రుద్రవరం మండలం ఆలమూరు చీలబోయిన చెరువులోకి వర్షం వల్ల బురద నీరు చేరి చేపలన్నీ మృతి చెందాయని శుక్రవారం బెస్తలు తెలిపారు. రెండు రోజుల క్రితం కురిసిన వర్షానికి నీరంతా బురదగా మారి రూ.12 లక్షల విలువైన చేపలు మృతి చెందాయి. 2023 సెప్టెంబరులో 2 లక్షల చేపపిల్లలు చెరువులో వదిలారు. ఈ చెరువుపై 85 కుటుంబాలు ఆధారపడి ఉన్నాయి. తమను ప్రభుత్వం ఆదుకోవాలని బెస్తలు డిమాండ్ చేశారు.

పోలింగ్‌కు పటిష్ట ఏర్పాట్లు: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ కె.శ్రీనివాసులు.

నంద్యాల (కల్చరల్/క్రైం), మే 10 : సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ కె. శ్రీనివాసులు తెలిపారు. స్థానిక కలెక్టర్ చాంబర్‌లో శుక్రవారం పోలింగ్‌కు చివరి 72 గంటల ప్రొటోకాల్, ఇతరత్రా అంశాలపై ఎస్పీ కె. రఘువీర్‌రెడ్డితో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలింగ్‌కు ముందు చివరి 72 గంటలు అత్యంత కీలకం అన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో రెండు బ్యాలెట్ యూనిట్లు అవసరమవుతున్న నేపథ్యంలో అదనపు బ్యాలెట్ యూనిట్లు తెప్పించి కమిషన్ నిర్వహించి అన్ని నియోజకవర్గాల్లోని స్ట్రాంగ్‌రూమ్‌లలో భద్రపరిచామని పేర్కొన్నారు. ఈ నెల 12న నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో ఎన్నికల సామగ్రి పంపిణీ చేస్తామన్నారు. 13వ తేదీన ఉదయం 7గంటలనుంచి సాయంత్రం 6గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. 1350 పోలింగ్ కేంద్రాల్లో మైక్రో అబ్జర్వర్లను నియమిస్తున్నట్లు తెలిపారు. ఓటర్లందరికీ సచివాలయ సిబ్బంది ద్వారా స్లిప్పులు పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. ఈవీఎంలను తరలించే వాహనాలను జీపీఎస్ ట్రాకింగ్ ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు. ఎన్నికల కోసం నాలుగు కంపెనీల పోలీసు బలగాలు వచ్చాయని ఎస్పీ వెల్లడించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో క్యూ ఆర్ టీమ్‌లు ఏర్పాటు చేయడంతోపాటు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు.

ల్యాండ్ టైటిలింగ్ చట్టం

రైతుల మెడకు ఉరితాడు

- వైసీపీని ఓడించి ఇంటికి పంపించండి
- మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి



ల్యాండ్ టైటిలింగ్ జీవో ప్రతులను దహనం చేస్తున్న బీసీ జనార్దన్‌రెడ్డి, టీడీపీ నాయకులు

బనగానపల్లె, మే 10: జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ చట్టం రైతుల మెడకు ఉరితాడులా పరిణమించిందని బనగానపల్లె టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. చెత్త చట్టాలను తీసుకొచ్చిన జగన్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపించాలని ఆయన పిలుపునిచ్చారు. బనగానపల్లె మండలంలోని పలుకూరు గ్రామంలో శుక్రవారం ప్రజాగళం బహిరంగ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన బీసీకి ప్రజలు ఘన స్వాగతం పలికారు. ముందుగా ల్యాండ్ టైటిలింగ్ చట్టం జీఓ ప్రతులను టీడీపీ నాయకులతో కలసి ఆయన దహనం చేశారు. ఈ సందర్భంగా బీసీ మాట్లాడుతూ ప్రజల భూములను కాజేసేందుకు జగన్ ఇలాంటి చట్టాలను తీసుకొస్తున్నాడన్నారు. దేశంలో ఇప్పటి వరకు బీజేపీ రాష్ట్రాలతో సహా ఏ రాష్ట్రం ల్యాండ్ టైటిలింగ్ చట్టం అమలు చేయలేదన్నారు. ప్రజల భూములు కబ్జా చేసేందుకే జగన్ ప్రభుత్వం ఈ చట్టం తెచ్చిందన్నారు 2023 అక్టోబరు 31 నుంచి అమలులోకి వచ్చినట్లు వైసీపీ ప్రభుత్వం జీవోనంబరు 512 తెచ్చిందన్నారు. ఏపీ ల్యాండ్ అథారిటీని ఏర్పాటు చేసి దానికి చైర్‌పర్సన్ కమిషన్ సభ్యులను నియమిస్తూ డిసెంబరు 20న ఉత్తర్వులు ఇచ్చారన్నారు. ఈ చట్టంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. ల్యాండ్, శ్యాండ్, వైన్, మైన్, గంజాయి, డ్రగ్స్, ఎర్రచందనం, రేషన్ బియ్యం కొల్లగొట్టడం ద్వారా రూ.8లక్షల కోట్లు జగన్ స్వాహాచేశాడన్నారు.

ఎవరు గెలిచినా మీదే గెలుపు

జిల్లా స్థాయి కూపన్ నెం.4

పాఠకుని పూర్తి పేరు : ....
డోరు నెంబరు : .... వీధి పేరు : ....
గ్రామం/పట్టణం : .... మండలం : ....
జిల్లా : .... పోస్టల్ పిన్‌కోడ్ : .... ఫోన్ నెం. ....

కర్నూలు ఉమ్మడి జిల్లాలోని ఒకొక్క అసెంబ్లీ స్థానంలో ఎవరు గెలుస్తారు అనేది, మీరు ఊహించిన అభ్యర్థి ఎదురుగా గడిలో టిక్ ✔ మార్క్ చేయండి.

నియోజకవర్గం పేరు	NDA కూటమి	YSRCP	కాంగ్రెస్	ఇతరులు
1. ఆదోని				
2. ఆలూరు				
3. పత్తికొండ				
4. కోడుమూరు (ఎస్సీ)				
5. ఎమ్మిగనూరు				
6. కర్నూలు				
7. మంత్రాలయం				
8. ఆళ్ళగడ్డ				
9. బనగానపల్లె				
10. డోన్				
11. శ్రీశైలం				
12. నందికొట్కూరు (ఎస్సీ)				
13. నంద్యాల				
14. పాణ్యం				
మొత్తం :				

కూపన్ పూర్తి చేసి వెంటనే ఈ దిగువ అడ్రస్‌కు పోస్టు ద్వారా గానీ, పర్సనల్‌గా గానీ పంపే ఏర్పాటు చేయండి

ఆంధ్రజ్యోతి కార్యాలయము : ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, సర్వే నెం : 1/1 & 1/2, ఇండస్ స్కూల్ దగ్గర, గుత్తి రోడ్డు, పందిపాడు గ్రామ పంచాయితి, కల్లూరు (మం.), కర్నూలు -518002.

సైకిలే మన గుర్తు



గూడూరులో టీడీపీ నాయకులు శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఓటర్లకు సైకిల్‌ను చూపుతూ కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరిని గెలిపించాలని కోరారు.

అన్నా మీ గెలుపు ఖాయం



కోడుమూరు మండలం వర్కూరు గ్రామంలో టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరిని సన్మానిస్తున్న కార్యకర్తలు

బీసీకి గజమాలతో స్వాగతం



బనగానపల్లె మండలంలోని పలుకూరు గ్రామంలో బీసీ జనార్దన్‌రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

మీ ఆశీర్వాదం కావాలి



మంత్రాలయం మండలం వి.తిమ్మాపురంలో ప్రచారం చేస్తున్న టీడీపీ అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి

టీడీపీ జెండా ఎగరాలి



బేతంచెర్లలో డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, ఆయన కుమార్తెను భారీ గజమాలతో సన్మానిస్తున్న టీడీపీ నాయకులు. డోన్‌లో టీడీపీ జెండాను ఎగరవేయాలని కార్యకర్తలకు కోట్ల పిలుపునిచ్చారు.

ముస్లింలకు అండగా ఉంటా



ఆత్మకూరులో శ్రీశైలం టీడీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖర్‌రెడ్డి ముస్లింలతో ర్యాలీ చేశారు. ముస్లింలకు ఎల్లప్పుడూ అండగా ఉండి సమస్యలు పరిష్కరిస్తానని ఆయన భరోసా ఇచ్చారు.

బుజ్జికన్నా బాగున్నావా...



కర్నూలులోని శ్రీనివాస మార్కెట్, షరాఫ్‌బజార్‌లో టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ ఇంటింటి ప్రచారం చేశారు. ఓ చిన్నారితో ముచ్చటించారు. 'ఒక్క అవకాశం ఇవ్వండి అక్కా మీ కష్టాలన్నీ తీరుస్తా'నని ప్రజలను కోరుకున్నారు.

మా నాన్నను గెలిపించండి



బనగానపల్లె మండలం రామవరంలో బీసీ జనార్దన్‌రెడ్డి కోసం ప్రచారం చేస్తున్న కుమార్తెలు మనోరమ, మాధవి



మల్లన్న ఆశీస్సులు ఎవరికో?

ఆత్మకూరు

శ్రీశైలానికి దేశంలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. ద్వాదశ జ్యోతిర్లింగాలు, అష్టాదశ శక్తి పీఠాల్లో ఒకటైన శ్రీశైల క్షేత్రంతోపాటు తెలుగు రాష్ట్రాలకు వెలుగులను ఇచ్చే శ్రీశైలం జలాశయం, దేశంలోనే అతిపెద్దదైన నాగార్జున సాగర్-శ్రీశైలం టైగర్ ప్రాజెక్ట్‌తోపాటు మరెన్నో చారిత్రాత్మక, ఆధ్యాత్మిక ప్రదేశాలు శ్రీశైల నియోజకవర్గంలో ఉన్నాయి. ఇంతటి ప్రాధాన్యత కలిగిన శ్రీశైల నియోజకవర్గంలో రాజకీయ వేడి ఊపందుకుంది. టీడీపీ, వైసీపీ అభ్యర్థులు పోటాపోటీగా ఎన్నికల ప్రచారాన్ని సాగిస్తున్నారు. ఎవరికి వారు తమ వ్యూహాలకు పదును పెడుతున్నారు. ప్రజల దగ్గరికి వెళ్లి తమ వాగ్దానాలను వినిపిస్తున్నారు. ఈ ఎన్నికల్లో శ్రీశైల మల్లన్న ఆశీస్సులు ఎవరికన్నది మరో నాలుగు రోజుల్లో తేలనుంది.

- రెండు దశాబ్దాల తర్వాత టీడీపీకి జోష్
- ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్న బుడ్డా
- గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్న ఎమ్మెల్యే శిల్పా
- ఆసక్తిగా మారిన శ్రీశైల నియోజకవర్గ రాజకీయం


రెండు దశాబ్దాల తర్వాత ..

నందికొట్కూరు నియోజకవర్గం పరిధిలో ఉన్న ఆత్మకూరు తాలుకా 1978లో తొలిసారిగా నియోజకవర్గంగా ఏర్పడింది. ఆ తర్వాత 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో శ్రీశైలం నియోజకవర్గంగా రూపాంతరం చెందింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు మొత్తం పది సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరగ్గా అందులో ఐదు సార్లు కాంగ్రెస్, మూడు సార్లు టీడీపీ, రెండు సార్లు వైసీపీ గెలిచాయి. తొలి నుంచి ఈ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉండటంతో 1978లో మాజీ మంత్రి ఆత్మకూరు వెంగళరెడ్డి, 1989లో మాజీ ఎమ్మెల్యే బుడ్డా వెంగళరెడ్డి, 1994, 2004, 2009 ఎన్నికల్లో ఏరాసు ప్రతాపరెడ్డి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా నిలిచి విజయబావుట ఎగురవేశారు. అదేవిధంగా టీడీపీ ఆవిర్భావం తర్వాత 1983, 1985లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా బుడ్డా వెంగళరెడ్డి పోటీ చేసి గెలిచారు. అతర్వాత మాజీ ఎమ్మెల్యే బుడ్డా వెంగళరెడ్డి మరణాంతరం ఆయన కుమారుడు బుడ్డా సీతారామిరెడ్డి 1999లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. ఈ క్రమంలోనే 2014 ఎన్నికల్లో వైసీపీ తరపున పోటీ చేసిన మాజీ ఎమ్మెల్యే రాజశేఖరరెడ్డి గెలిచినప్పటికీ ఆ తర్వాత టీడీపీలో చేరారు. 2019లో వైసీపీ తరపున పోటీ చేసిన శిల్పా చక్రపాణిరెడ్డి గెలిచారు. అయితే ఇప్పటి వరకు జరిగిన ఎన్నికలతో పోలిస్తే ఈసారి జరిగే ఎన్నికలు భిన్నంగా కనిపిస్తున్నాయి. రెండు దశాబ్దాల తర్వాత నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగురవేసేలా కార్యకర్తల్లో ఉత్సాహం కనిపిస్తోంది.

ఎమ్మెల్యే శిల్పాకు గడ్డు కాలం..?

శ్రీశైల నియోజకవర్గంలో ఈ సారి జరిగే ఎన్నికల్లో వైసీపీకి గడ్డుకాలం కనిపిస్తోందని చెప్పవచ్చు. ఎందుకంటే ఐదేళ్లలో ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ చెప్పుకోదగ్గ అభివృద్ధి అంశాలేవి కనిపించడం లేదు. దీంతో చేసేది ఏమీలేక కొన్ని అంశాలపైనే వైసీపీ దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ప్రత్యేకించి టీడీపీ, బీజేపీ పొత్తుపై ముస్లిం మైనార్టీల్లో దుష్ప్రచారం చేసి టీడీపీకి ఓట్లు పడకుండా ఉండేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అదేవిధంగా డబ్బులను కూడా విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అసంతృప్తి నాయకులకు ప్యాకేజీలు, ప్రచారాల్లో పాల్గొనే వారికి మద్యం, డబ్బు కావాల్సినంతగా ఇస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఇవే గాకుండా ఎన్నికలకు ముందు చాలా చోట్ల తనకు అనుకూలంగా ఉన్న పోలీసు, ఇతర అధికారులను నియమించుకున్నట్లు సమాచారం. వారి ద్వారా ఎన్నికల్లో లబ్ధి పొందాలని పావులు కదుపుతున్నారు. కాగా ఎమ్మెల్యే శిల్పా ఎక్కడి నుంచో వలస వచ్చిన స్థానికేతరుడని మాజీ ఎమ్మెల్యే బుడ్డా ప్రజల్ని చైతన్యపరుస్తున్నారు. ప్రస్తుత ఎన్నికల్లో ఈ అంశం ప్రజల్లో చర్చకు దారితీస్తోంది. ఏదిఏమైనా.. నువ్వా.. నేనా..! అన్నట్లుగా సాగే ఈ ఎన్నికల్లో శ్రీశైల మల్లన్న ఆశీస్సులు ఎవరికి ఉంటాయో వేచి చూడాలి.





ప్రజల్లో ఊహించని మార్పు :

కాంగ్రెస్ పార్టీకి 2014లో జరిగిన ఎన్నికల్లో ఓటర్లు ఊహించని విధంగా షాక్ ఇచ్చారు. కాంగ్రెస్ వల్లే రాష్ట్రానికి అన్యాయం జరిగిందని భావించి ఆ పార్టీని కాదని గంపగుత్తగా మెజార్టీ ఓటర్లు వైసీపీ వైపు వెళ్లారు. 2014, 2019 ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థులను గెలిపించారు. అయితే ప్రస్తుతం సీన్ రివర్స్ అయింది. 46 ఏళ్ల శ్రీశైల నియోజకవర్గ చరిత్రలో కాంగ్రెస్, టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి మినహాయిస్తే వైసీపీ హయాంలో ప్రస్తుతం చెప్పుకోదగ్గ అభివృద్ధి ఏమీ జరగలేదు. ఈ పరిస్థితుల్లో వైసీపీకి ఓటేసినా ఫలితం ఉండదన్న భావనతో ఇక్కడి ఓటర్లు నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ఇదే క్రమంలో వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉండటంతోపాటు స్థానిక ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తీరుపై ఇక్కడి ప్రజలు మండిపడుతున్నారు. ప్రత్యేకంగా చెప్పాలంటే ఆత్మకూరులో ముస్లింల మైనార్టీల జనాభా అధికం. వీరు మొదటి నుంచి కాంగ్రెస్, వైసీపీ వైపే ఎక్కువగా మొగ్గు చూపారు. అయితే ఈసారి అత్యధికంగా ముస్లిం మైనార్టీలు టీడీపీలో చేరారు. అలాగే ఎస్సీలు కూడా తొలి నుంచి కాంగ్రెస్, వైసీపీల వెంటే నడిచినా ఈసారి వారిలో కూడా మార్పు కనిపిస్తోంది. దీంతో ఈమార్పు ప్రస్తుతం జరిగే ఎన్నికల్లో టీడీపీ విజయానికి సంకేతమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

రండి బాబూ రండి..!

కారు కావాలంటే పంపిస్తాం
ఎక్కువ మంది ఉంటే బస్సు కూడా..
గ్రామీణ ఓట్లకు భారీ డిమాండ్



ఆదోని, మే 10: సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకమైనదేనని అభ్యర్థులు గుర్తిస్తున్నారు. ఏ ఓటును వదులుకోరాదన్న ధృడ సంకల్పంతో పార్టీ అభ్యర్థులు ప్రతి గ్రామంలో ఉన్న ఓటర్లను రప్పించి ఓట్లు వేయించాలని కార్యకర్తలకు ఆదేశాలిచ్చారు. పట్టణంలో నివాసం ఉంటూ గ్రామాల్లో ఓటు హక్కున్న ప్రతి ఓటర్‌ను గ్రామాలకు రప్పించడానికి ప్రత్యేక ప్రయత్నాలు చేస్తున్నారు. కొందరైతే హోటళ్లు, ఫంక్షన్ హాళ్లలో సమావేశాలు జరిపి విందులిచ్చారు. పోలింగ్ రోజు ఉదయమే ప్రతి నలుగురు, ఐదుగురు ఓటర్లకు ఓ కారు చొప్పున వారి ఇంటి వద్దకే వాహనాన్ని పంపి, గ్రామాలకు తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు చేశారు. ఒక్కో గ్రామానికి 30 మందికి మించి ఉంటే ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేస్తామని హామీలిచ్చారు. దీంతో ట్రావెల్స్ సంస్థలకు భారీ డిమాండ్ పెరిగింది. పట్టణం, నగరం నుంచి నేరుగా వచ్చే వారికి బస్సు, రైలు లాంటి సౌకర్యాలు కల్పించడం.. ఫ్యామిలీలు, ఎక్కువ ఓట్లు ఉన్న వారికి కార్లు సమకూరుస్తామని చెబుతున్నారు. ఓటేసిన తర్వాత తిరిగి నగరంలో దింపేసేలా చర్యలు తీసుకుంటున్నారు. అయితే, రెండు చోట్ల ఓట్లు ఉన్న వారే స్థానికంగా ఓటుకు డబ్బులు వస్తే ఇక్కడే ఉందామని, లేకుంటే రవాణా చార్జీలతో పాటు అధిక మొత్తంలో వస్తే ఊరికి వెళ్లేలా ప్లాన్ చేసుకుంటున్నారు. రెండు చోట్ల ఓట్లు ఉన్న వారంతా ఓటుకు పలుకుతున్న విలువలను లెక్కలేసుకుంటున్నారు. ద్విముఖ పోటీ ఉన్న దగ్గర ఇరు పార్టీల నుంచి, త్రిముఖ పోటీ ఉన్న దగ్గర మూడు పార్టీల నుంచి డబ్బులు తీసుకోవడానికి ఫోన్లలోనే సంప్రదింపులు చేస్తున్నారు.

రెండు ప్రాంతాల్లో ఓట్లు.. తేల్చుకోలేక సతమతం

కర్నూలులో పని చేస్తున్న జనార్దన్‌ది సొంత ఊరు ఆదోని పరిధిలోని పెద్దహరివాణం. పదేళ్ల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి కర్నూలు నగరంలో నివాసం ఉంటున్నారు. అయితే, ఎన్నికల సందర్భంగా ఆయన ఉంటున్న ప్రాతంలో అమ్మా నాన్నతో పాటు భార్య ఓటు నమోదు చేయించారు. ఓటు నమోదు చేసుకున్న సందర్భంలోనే ఊరిలో ఓటు తొలగించారని భావించారు. కానీ నాలుగు రోజుల క్రితం గ్రామం నుంచి ఓ పార్టీ అభ్యర్థి అనుచరులు ఫోన్ చేసి ఇక్కడ ఓటు ఉందని, వేసి వెళితే నలుగురికి రవాణా చార్జీలు అందిస్తామని చెప్పారు. అయితే ఊరికి వెళ్లి ఓటు వేయాలా..? లేకుంటే ఇక్కడే ఉండి ఓటు వేయాలా.. అనే అంశంపై జనార్దన్ కుటుంబం సందిగ్ధంలో పడింది... ఇదే తరహాలో నగరంలోని పలువురు ఓటు ఎక్కడ వేయాలా.. అనే అంశంపై సందిగ్ధంలో పడ్డారు. ఉపాధి నిమిత్తం నగరానికి వచ్చిన వారికి ఇటు నగర పరిధిలో ఓటు నమోదు చేసుకోగా సొంత ఊళ్లలో కూడా ఓట్లు ఉన్నాయి. ఇలా రెండు ప్రాంతాల్లో ఓట్లు ఉన్న వారంతా ఎక్కడ ఓటు వేయాలనే అంశాన్ని కొందరూ తేల్చుకోలేకపోతున్నారు. ఊళ్లలో ఓటేసేందుకు ఆయా పార్టీల అభ్యర్థులు ఫోన్లు చేసి మరీ పిలుస్తున్నారు. అయితే నగరంలో ఓటు ఉన్నా కానీ, ఎక్కడ వేద్దామంటే ఇప్పటి వరకు ఎవరూ కూడా తమను సంప్రదించలేదని, ఊరికి వెళ్లాలంటే రెండు రోజుల పనిపోతుందని వాపోతున్నారు.

● నగరంలో పట్టించుకోవట్లే..

నగర పరిధిలో ఓటు ఉన్నా కానీ, వివిధ నియోజకవర్గాల్లో అభ్యర్థులు అంతగా ప్రాధాన్యమివ్వడం లేదు. కొన్ని ప్రాంతాలు, కొన్ని కాలనీలు, కొన్ని బస్తీల్లోనే ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తున్నారు. మరికొన్ని ప్రాంతాలను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. నగరానికి వలస వచ్చి స్థిరపడిన ఓటర్లను ఆయా ప్రాంతాల్లోని అభ్యర్థులు పట్టించుకోవడం లేదు. వారికి ఊళ్లలో కూడా ఓటు ఉందనే సమాచారముంటే చాలు.. ఆ వైపు కన్నెత్తి చూడడం లేదు.

మసీదులో వైసీపీ నాయకుడి ప్రచారం



మసీదులో ప్రచారం చేస్తున్న వైసీపీ నాయకుడు

నందికొట్కూరు, మే 10: నందికొట్కూరులో నిబంధనలకు విరుద్ధంగా మసీదులో వైసీపీ నాయకులు ప్రచారం చేపట్టారు. శుక్రవారం పట్టణంలో బైరెడ్డి నగర్‌లోని మసీదు ప్రార్థనల అనంతరం మసీదులోనే ముస్లింలకు వైసీపీ నాయకుడు అబూబకర్ వైసీపీకి ఓటు వేయాలంటూ ప్రచారం చేపట్టారు. అయితే ప్రార్థనా స్థలాలు, దేవాలయాలు, తదితర ప్రాంతాల్లో ప్రచారం చేయడం నిసిద్ధం. అయితే వైసీపీకి ముస్లిం మైనార్టీలు మద్దతు తెలపాలంటూ వైసీపీ నాయకుడు ప్రచారం మొదలుపెట్టారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థులపై విషప్రచారం చేసినట్లు తెలుస్తోంది. ముస్లింల ఓట్లను ప్రభావితం చేసేందుకు ఎన్నికల ప్రవర్తన నియమావళికి విరుద్ధంగా ప్రార్థనా స్థలాల్లో ప్రచారం చేస్తున్నట్లు తెలుస్తోంది.

నేటితో ముగియనున్న ప్రచారం

కర్నూలు, మే 10 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల ప్రచార ఘట్టానికి శనివారం సాయంత్రం ఆరు గంటలకు తెర పడనుంది. దాదాపు రెండు నెలలు పాటు ప్రచారం సాగించిన అభ్యర్థులు ప్రస్తుతం ప్రలోభాలపై దృష్టి సారించారు. జిల్లాలో ఎంపీ, ఎమ్మెల్యేల స్థానాల కోసం 121 మంది బరిలో నిలిచారు. విజయమే లక్ష్యంగా ప్రధాన పార్టీ అభ్యర్థులు ప్రలోభాలకు పదును పెట్టారు. ముఖ్యంగా అధికార వైసీపీ నాయకులు ఓ అడుగు ముందుకు వేసి ఓటుకు రూ.2 వేలు పంచుతున్నట్టు తెలిసింది. వారికి దీటుగా టీడీపీ నాయకులు కూడా సిద్ధమైనట్లు సమాచారం. అదే క్రమంలో గంపగుత్త ఓట్లపై ప్రధాన పార్టీలు దృష్టి సారించాయి. బెంగళూరు, హైదరాబాదు నగరాల్లో ఉంటున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను స్వగ్రామాలకు రప్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

దోసె వేసెయ్



నంద్యాలలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జె.లక్ష్మి నరసింహ యాదవ్ శుక్రవారం ప్రచారం చేపట్టారు. ఓ హోటల్‌లో దోసెలు వేస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు.


విక్టరీ మనదే..

ఆళ్లగడ్డలో టీడీపీ అభ్యర్థి భూమా అఖిలప్రియ శుక్రవారం ప్రచారం సాగించారు. ఓటర్లకు అభివాదం చేస్తూ ఇలా కనిపించారు.



ఆదోని, మే 10: ఎమ్మెల్యే పదవి కోసం, అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా డబ్బులు కుమ్మరిస్తున్నారు. ఎన్నికల వ్యయ పరిమితి రూ.40 లక్షలే కాగా ఖర్చులు మాత్రం రూ. కోట్లకు కోట్లు దాటుతున్నాయి. జిల్లాలోని ప్రధాన పార్టీల మధ్య పోటీ నువ్వా.. నేనా.. అన్నట్లుగా ఉంది. లక్షలు గుమ్మరించి హోరెత్తించిన ప్రచార ఘట్టం ఆఖరు దశకు చేరగా, ఇక అతి ముఖ్యమైన పోల్ మేనేజ్‌మెంట్ కోసం లెక్కకు మించి ఖర్చు చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.





ఓట్ల కోసం ధన ప్రవాహం!

● సౌండ్ పార్టీలు....

ప్రస్తుత ఎన్నికలలో ఎన్నడూ లేనంత వ్యయంతో ఖరీదైనవిగా రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. టిక్కెట్లు కేటాయించడంలో పార్టీలు ధనం ఉన్న వారికే ప్రాధాన్యం ఇవ్వడంతో వారంతా ఖర్చులో పోటీ పడుతున్నారు. ఒక్కొక్కరు వందల కోట్ల విలువ గల స్థిర, చర ఆస్తులు, పెద్ద మొత్తంలో డబ్బులు ఉన్నట్లు అఫిడవిట్లలో పేర్కొన్నారు. ఎన్నికల నియమావళి ప్రకారం అభ్యర్థులు రూ.40 లక్షలు మాత్రమే ఖర్చు చేయాలి. కానీ అభ్యర్థుల ఖర్చు మాత్రం రూ.40 కోట్ల మార్కు దాటడం ఖాయంగా కనిపిస్తోంది.

● జంపింగ్ లీడర్లకు ప్యాకేజీలు...



మండల, గ్రామ స్థాయిలో ఏ కాస్త బలం ఉన్న నాయకులున్నా... వారి మద్దతుకై అభ్యర్థులు ప్రత్యేక దృష్టి సారించారు. వారితో మాట్లాడి పార్టీల్లోకి చేర్చుకుంటున్నారు. స్పెషల్ ఆఫర్లతో కొందరు లీడర్లు పొద్దున ఒక పార్టీలో ఉంటే, సాయంత్రం మరో పార్టీకి మారుతున్నారు. ఎవరు ఏ పార్టీలో ఉన్నారో గుర్తించలేనంత వేగంగా కండువాలు మారుస్తున్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు ఇలా పదవులను బట్టి రేటు కట్టినట్లు తెలుస్తోంది. ఫిరాయింపులకే అభ్యర్థులు పెద్ద మొత్తంలో వ్యయం చేసినట్లు ప్రచారం జరుగుతోంది.

● రోజు ఖర్చు రూ.లక్షల్లోనే...

ప్రజల దృష్టిని ఆకర్షించడానికి అభ్యర్థులు రోజువారీగా గ్రామాలు, పట్టణాల్లో ఇంటింటికి చేస్తున్న ప్రచారానికి, బలని రూపణ కోసం నిర్వహించే ర్యాలీలు, రోడ్‌షోలకు లక్షలకు లక్షలే ఖర్చు చేస్తున్నారు. తక్కువలో తక్కువ ర్యాలీల్లో 800 నుంచి వెయ్యి మంది వరకు ఉంటున్నారు. వారిని ఒక్కొక్కరికి రూ.300 నుంచి రూ.500 వరకు నగదుతో పాటు టిఫిన్లు, భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు. కొందరికి మద్యం సీసాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిసింది. స్పెషల్‌గా తమ అనుచరులు, కార్యకర్తలకు మందు, విందుల కోసం డబ్బులను ఫుల్లుగా వెచ్చిస్తున్నారు.

● వ్యయ పరిమితి రూ.40 లక్షలే... ● ఖర్చు మాత్రం రూ. కోట్లలో...


ఎన్నికల నియమావళి ప్రకారం బరిలో నిలిచిన వారు ఇష్టారీతిన డబ్బు ఖర్చు పెట్టడానికి వీలు లేదు. ప్రస్తుత నిబంధనలు అనుసరించి వ్యయ పరిమితి గరిష్ఠంగా రూ.40 లక్షలుగా నిర్ణయించారు. ఆపై ఖర్చు చేస్తే వారిపై అనర్హత వేటు వేస్తారు. అభ్యర్థులు సభలు, సమావేశాలు, ప్రచార సామగ్రికి చేస్తున్న ఖర్చులను అధికారులు ఎప్పటికప్పుడు రికార్డు చేసుకుంటున్నారు. నామినేషన్ వేసిన నాటి నుంచి పోలింగ్ జరిగే వరకు అభ్యర్థి చేసే ప్రతీ ఖర్చును ఎన్నికల వ్యయంగానే పరిగణిస్తారు. పార్టీ జెండాలు, బ్యానర్లు, పోస్టర్లు, కరపత్రాలు, భోజనాలు,

● లెక్కదాటితే అనర్హత వేటే...

వాహనాల అద్దె, సభా వేదికలు, పత్రికల ప్రకటనలను ఎన్నికల ఖర్చుల్లోనే లెక్కిస్తారు. వీటన్నింటికి బిల్లులు సమర్పించాల్సి ఉంటుంది. ఈసీ నిర్దేశించిన ధరల ఆధారంగానే లెక్కలు కడుతారు. అభ్యర్థులు ఓటర్లను ప్రభావితం చేసేలా మద్యం, నగదు, వివిధ రకాల బహుమతులను ఇచ్చి ప్రలోభాలకు గురిచేసే అవకాశం ఉండటంతో ఈసీ ఇలాంటి చర్యలపై ప్రత్యేక నిఘా పెట్టింది. చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి అనుమతులు, సరైన ఆదారాలు లేని నగదును సీజ్ చేస్తున్నారు. బ్యాంకుల ద్వారా రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు జరుగుతున్న లావాదేవీలను పరిశీలిస్తున్నారు. అధిక మొత్తంలో డ్రా చేసే వారి వివరాలను బ్యాంకు నుంచి సేకరిస్తున్నారు. అక్రమంగా జరిగే లావాదేవీలపై అధికారులు విచారణ జరిపి ఏదైనా అనుమానం ఉంటే వెంటనే ఖాతా సీజ్ చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఎన్నికల అనంతరం అభ్యర్థుల నుంచి ఖర్చుల లెక్కలు తీసుకుంటామని గరిష్ఠ పరిమితి మించి వ్యయం చేసినట్లు తేలితే వారిని ఈసీ అనర్హులుగా ప్రకటించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

● గరిష్ఠ వ్యయ పరిమితి రూ.40 లక్షలు..

ఇంతితై వటుడింతింతై అన్నట్టు అసెంబ్లీ ఎన్నికల వ్యయం భారీగా పెరుగుతోంది. తొలి ఎన్నికల్లో గరిష్ఠ వ్యయ పరిమితి రూ.లక్ష మాత్రమే ఉండగా, నలభై రేట్లు పెరిగి రూ.40 లక్షలకు చేరింది. పెరుగుతున్న ధరల దృష్ట్యా ఈసీ కూడా ఎన్నికల వ్యయ పరిమితిని పెంచుతూ వస్తోంది. 1952 సాధారణ ఎన్నికల సమయంలో అసెంబ్లీ అభ్యర్థుల వ్యయ పరిమితి రూ.లక్ష మాత్రమే. ఇది 1962 నాటికి రూ.3 లక్షలు, 1971 ఎన్నికల్లో రూ.4 లక్షలకు, 1975 నాటికి రూ.5 లక్షలకు చేరింది. 1984 అసెంబ్లీ ఎన్నికల్లో రూ.5 లక్షలుగా ఉన్న వ్యయ పరిమితిని ఏకంగా రెట్టింపు చేసి రూ.10 లక్షలకు పెంచారు. 1991లో రూ.12 లక్షలు, 1999లో రూ.15 లక్షలు, 2007లో రూ.17 లక్షలు, 2009లో రూ.26 లక్షలు, 2014లో రూ.28 లక్షల వ్యయ పరిమితిగా నిర్ణయించారు. ఇది ప్రస్తుత ఎన్నికల్లో రూ.40 లక్షలుగా నిర్దేశించారు. పేరుకే వ్యయపరిమితి కాగా లక్షల నుంచి పదుల కోట్లకు అభ్యర్థుల ఖర్చులు చేరాయి.



● అగ్రనేతల సభలకు కోట్లే..

ప్రధాన పార్టీల అభ్యర్థులందరూ తమ అగ్రనేతలతో ప్రచార సభలు నిర్వహించారు. ఒక్కో మీటింగ్‌లో 30 వేల నుంచి 50 వేల వరకు ప్రజలు పాల్గొనేలా ఏర్పాట్లు చేశారు. వేల మంది జన సమీకరణ, కుర్చీలు, టెంట్లు, స్టేజీ ఏర్పాట్లు, అలంకరణ, మైక్‌సెట్లు, డ్రోన్లు, వీడియోలు ఇలా ప్రతీ దానికి లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. జనాల తరలింపు, వారిని వాహనాలు, భోజనాల ఏర్పాట్లు, మద్యం పంపిణీ ఒకరిని మించి మరొకరు చేస్తున్నారు. ఒక్కో అభ్యర్థి అగ్రనేతలు, స్టార్ క్యాంపెయినర్ల సభలకు కోట్ల రూపాయలు వ్యయం చేస్తున్నారు. పార్టీ ఖర్చులతోనే సభ ఏర్పాటు చేసినట్లు చెప్పుకుంటారు. కాని అభ్యర్థులే ఖర్చు భరిస్తారనేది బహిరంగ రహస్యం.

ఎక్కడికెళ్లినా ఎన్నికల చర్చలే..



ఆదోని, మే 10: నలుగురు ఎక్కడ కలిసినా.. సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాల గురించి చర్చ... హోటల్స్, బార్బర్ షాపు, గ్రామాల్లో, రచ్చబండ దగ్గర... ఇలా ఏ నలుగురు కలిసినా రాజకీయంపైనే చర్చ జరుగుతోంది. ఉదయం, సాయంత్రం బ్యాచ్‌లు మాత్రమే కాకుండా, స్థానిక రాజకీయాలతోపాటు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ అంశాలు కూడా చర్చించుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న ఎన్నికలే ప్రధాన అంశంగా చర్చ సాగుతోంది. ఏ పార్టీ అధికారంలోకి వస్తుంది. ఎవరు ఏ నియోజకవర్గంలో గెలుస్తారు. అంటూ జోరుగా, హుషారుగా ముచ్చట్లు సాగిస్తున్నారు. అసెంబ్లీని మించిన వాదోపవాదాలు, సవాళ్లు, ప్రతి సవాళ్లు ఇక్కడ కనిపిస్తున్నాయి.

అలకబూనిన అమరావతి నగర్ కౌన్సిలర్

ఆదోని, మే 10: ప్రచార నిమిత్తం అమరావతి నగర్‌కు వస్తున్నట్టు ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి కనీస సమాచారం కూడా ఇవ్వలేదని ఆ వార్డు కౌన్సిలర్ లలిత మధుసూదన్ శర్మ అలకబూనారు. శుక్రవారం ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి అమరావతి నగర్ వార్డులో పర్యటించారు. అయితే స్థానిక కౌన్సిలర్‌కు సమాచారం ఇవ్వకపోవడంతో అగౌరవ పరిచినట్టుగా ఆమె భావించారు. అయితే ఒక్క అమరావతి నగర్ కౌన్సిలరే కాదు... మిగతా కౌన్సిలర్లు కూడా ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నట్టు తెలుస్తోంది. కొత్తగా పార్టీలోకి వచ్చిన వారికే గౌరవ మర్యాదలు దక్కుతున్నాయని, వార్డు కౌన్సిలర్లు అనే కనీస గౌరవం కూడా తమకు ఇవ్వడం లేదని వారు అంతర్మథనం చెందుతున్నారు. వీరంతా సమయం కోసం వేచి చూస్తున్నారని, మే 13న తమకు జరిగిన అవమానానికి తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నట్టు సమాచారం.

పట్టణంలో రూ.2 వేలు.. పల్లెల్లో రూ.1500

అధికార పార్టీపై జోరుగా ప్రచారం



నందికొట్కూరు, మే 10: 2024 సార్వత్రిక ఎన్నికలు తుది దశకు చేరుకోనున్నాయి. ఇక ఆయా పార్టీల అభ్యర్థులు ప్రచార గడువు శనివారం సాయంత్రం 6 గంటలకు ముగియనుంది. సాధారణంగా ప్రచారం ముగిశాక డబ్బుల పంపిణీ తెరపైకి వస్తుంది. కాని ఈ సారి ఒక వైపు ప్రచారం జరుగుతుండగానే... మరో వైపు ఓటర్లకు డబ్బుల పంపిణీ కార్యక్రమానికి అధికార పార్టీ నాయకులు తెరలేపినట్లు తెలుస్తోంది. నందికొట్కూరు పట్టణంలో టీడీపీ బలంగా ఉన్న చోట అధికార పార్టీ రూ.2 వేలు పంపిణీ చేస్తున్నట్లు, గ్రామాల్లో రూ.1500 పంపిణీ జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

జాగ్రత్త ఓటరూ...!



జాడలేని నేతలు
నీ జాడ తెలుసుకొని
మీ వీధిలో చేతులు జోడించి
మీ ముంగిట
ముగ్గులా మెరుస్తున్నారు..
ఓటుకు నోటుతో మీకు
ముకుతాడు వేసి
మురికివాడలోని పిల్లల ముడ్లు
కడిగేస్తున్నారు..
చిరువ్యాపారులతో కలిసి తేనీటిని
సేవిస్తున్నారు...
కాళ్లకు చెప్పులు కూడా కొనలేని
పేదవాడి పాదాలను
అప్రయత్నంగా తాకుతున్నారు...
నెరవేరని హామీలన్నీ
నెమరువేస్తూ చెప్పేస్తున్నారు
సమాధానమై నిలవాలి
నీ ఓటు ఆయుధం..
సాహసించకపోతే నీ ఉనికికే
ప్రమాదం

- దాసరి వెంకట రమణ,
కర్నూలు

వలస కూలీలు వచ్చేశారు..

గోనెగండ్ల, మే 10: ఓటు వేయడానికి వలస కూలీలు సొంత గ్రామాలకు వచ్చేశారు. మండలంలోని 20 గ్రామ పంచాయతీల నుంచి దాదాపు 25 వేల మంది వలసలు వెళ్లారు. ఈ 13న జరగబోయే ఎన్నికలకు వైసీపీ నాయకులు వారిని సొంత గ్రామాలకు రప్పించారు. అలాగే నందవరం, ఎమ్మిగనూరు రూరల్ నుంచి ఎక్కువ మంది వలస కూలీలు వలసలు వెళ్లారు. వారు కూడా శనివారం రాత్రి కానీ మరుసటి రోజు ఉదయం కానీ వారి సొంత గ్రామాలకు చేరనున్నట్లు తెలుస్తోంది. వీరికి ప్రయాణ ఖర్చులు, భోజనం, మద్యం ఖర్చులు భరించడంతోపాటు ఓటుకు ఇంత మొత్తం ఇస్తామని చెప్పి పిలిపిస్తున్నట్టు సమాచారం.



కరుణించండి..!



- ఇష్టదైవాలపై భారం వేసిన అభ్యర్థులు
- దీవెనలందించాలని పూజలు
- నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని ముడుపులు

ఆదోని, మే 10: ప్రచారం బాగా చేశాం.. కాలికి బలపం కట్టుకొని ఇంటింటికీ తిరిగాం. డబ్బులు కూడా అందరికీ పంచాం. ఇక ఓటర్ల దయ. అంతకంటే ఎక్కువగా నమ్ముకున్న దేవతల దీవెన... గెలుపోటముల బాధ్యత ఆ ఇద్దరిపైనే.. నమ్మిన ప్రజలు సోమవారం ఓట్లు వేసి గెలిపిస్తారో.... ఇష్టదైవాలు అండగా నిలుస్తారో... లేదో వేచి చూడాలి.. ప్రస్తుతం అభ్యర్థుల నోటి నుంచి వస్తున్న మాటలివి. పోలింగ్‌కు మరికొన్ని గంటలు మాత్రమే మిగిలి ఉన్న తరుణంలో అభ్యర్థులు అనుచరులతో మాట్లాడుతున్న మాటలు ఆసక్తి రేపుతున్నాయి. ఎన్నికలను పురస్కరించుకుని జిల్లాలో పలు నియోజకవర్గాల్లో టఫ్ ఫైట్ నడుస్తోంది. నెల రోజుల క్రితం వరకు గెలుపును పక్కన పెట్టి మెజారిటీ లెక్కలు వేసుకుని ఊహాలోకంలో విహరించిన నేతలు హడలిపోతున్నారు. ప్రత్యర్థుల నుంచి గట్టి పోటీ ఎదరవుతుండడంతో అసలు గెలుస్తామా...? లేదో అన్న ప్రశ్నతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు.

● దేవుళ్లకు ముడుపులు కట్టి..

ఓటర్లపై నమ్మకం పెట్టుకున్న అభ్యర్థులు ఇష్టదైవాలను కూడా గట్టిగా మొక్కుతున్నారు. తమను గెలిపించాలని కొందరు ముడుపులు కట్టినట్లు తెలుస్తోంది. గెలిచిన తర్వాత మీ సన్నిధికి వచ్చి ముడుపులు చెల్లిస్తానమని పూజిస్తున్నారు. కాగా, అభ్యర్థులతో పాటు వారి కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులు కూడా పూజల్లో నిమగ్నమైనట్లు తెలుస్తోంది. తమ వాడిని గెలిపిస్తే గుర్తింపుగా ఏదైనా చేయిస్తామని ప్రార్థిస్తుండడం ఆసక్తికరంగా మారింది.

● టెన్షన్ తప్పదు

సోమవారం పోలింగ్ అనంతరం జూన్ 4న వెలువడే ఫలితాల వరకు టెన్షన్ తప్పదంటూ అభ్యర్థులు వాపోతున్నారు. ప్రచారంలో తమకు ప్రజల నుంచి అపూర్వ స్పందన అభించిందని, ఫలితాలు అనుకూలంగా ఉంటాయని ఓ వైపు పైకి చెబుతున్నప్పటికీ... లోలోపల తీవ్ర ఉత్కంఠకు లోనవుతున్నారు. ఆదోని, మంత్రాలయం, ఆలూరు, ఎమ్మిగనూరు, పత్తికొండ, కోడుమూరు లాంటి నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు టెన్షన్‌తో గడుపుతున్నట్లు సమాచారం.








రాఘవేంద్రుడి కటాక్షం ఎవరికో..?

మంత్రాలయం, మే 10: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి కటాక్షం ఎవరికోనని నియోజకవర్గ అభ్యర్థులు ఉత్కంఠగా ఉన్నారు. గత ఉమ్మడి జిల్లాల పునర్విభజన కంటే ముందు మంత్రాలయం ఎమ్మిగనూరు నియోజకవర్గంలో ఉండేది.. 2009లో పునర్విభజన అనంతరం టీడీపీకే ఇక్కడి ప్రజలు పట్టం కట్టారు. 2014, 2019 జరిగిన ఎన్నికల్లో వైసీపీ విజయం సాధించింది. అయితే.. 2024 ఎన్నికల్లో బీసీ వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన రాఘవేంద్ర రెడ్డి పోటీలో ఉండగా వై.బాలనాగిరెడ్డి వైసీపీ నుంచి బరిలో నిలిచారు. నియోజకవర్గంలో అత్యధికంగా బీసీలే ఉండటం, అందులో వాల్మీకి ఓట్లే గెలుపు ఓటములు ప్రధానం కావడంతో ఈ నియోజకవర్గంలో మంత్రాలయంలో పోటీ రసవత్తరంగా మారింది. ఒకవైపు బీసీలు, మరో వైపు రెడ్డి సామాజిక వర్గాలు ఢీ అంటే ఢీ అనే స్థితిలో ప్రచారాలు సాగిస్తున్నాయి.



రాఘవేంద్ర బలాలు..

తన తండ్రి దివంగత ఎన్.రామిరెడ్డి గతంలో పీఆర్పీ నుంచి పోటీ చేయడం, కేడీసీసీ బ్యాంకు ఛైర్మన్‌గా పని చేయడం వల్ల ప్రజలకు దగ్గరయ్యారు. గతంలో బీవీ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో మంత్రాలయం, పెద్దకడుబూరు, కోసిగి మండలాల్లో అభివృద్ధి చేయడం వాల్మీకి సామాజికవర్గంతో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల ఓట్లు అనుకూలంగా ఉన్నాయి.

బలహీనతలు..

మొదటిసారిగా పోటీ చేయడం, గతంలో వైసీపీలో నాలుగున్నరేళ్లుగా కొనసాగి పార్టీ మారగానే.. ఎమ్మెల్యే టికెట్ దక్కడం. కేవలం బీసీ సామాజికవర్గాలపైనే ఫోకస్ చేయడం

బాలనాగిరెడ్డి బలాలు..

మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై.. నాలుగోసారి తానే గెలుస్తానన్న నమ్మకం.. రాంపురంరెడ్డి సోదరులు అంటే శత్రువులకు సైతం సేవలందిస్తారనే పేరు ఉండడం సేవా కార్యక్రమాలు చేయడం. పార్టీలకతీతంగా అందరినీ కలుపుకోవడం..

బలహీనతలు..

మూడుసార్లు ఎమ్మెల్యే అయినా... అభివృద్ధి చేయకపోవడం.. వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉండటం. ఆర్డీఎస్, పులికనుమ, గురు రాఘవేంద్ర ప్రాజెక్టులు నిర్మాణానికి నిధులు మంజూరు హామీని గాలికొదిలేసి తాగు, సాగునీరు అందించకపోవడం.



స్వేచ్ఛగా ఓటు వేయండి : డీఐజీ


ఎన్నికల తీరుపై అధికారులతో సమీక్షిస్తున్న డీఐజీ విజయరావు

ఆదోని, మే 10: ఈనెల 13వ తేదీ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు వేయాలని కర్నూలు రేంజ్ డీఐజీ సీహెచ్ విజయరావు పిలుపునిచ్చారు. ఆదోనిలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను శుక్రవారం డీఐజీ సీహెచ్ విజయరావు, ఎస్పీ కృష్ణకాంత్ కలిసి భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఎన్నికల ఏర్పాట్లపై రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల దగ్గర పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గురించి సంబంధిత పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు శివ నారాయణ స్వామి, శ్రీనివాసరెడ్డి, బీ సీతారామయ్య, సీఐ గోపీనాథ్, ఎస్‌ఐలు ఉన్నారు.

టీడీపీతోనే గ్రామాభివృద్ధి: గౌరు చరిత



భూపనపాడులో ప్రచారం చేస్తున్న గౌరు చరిత

పాణ్యం, మే 10: టీడీపీ అధికారంలోకి వస్తేనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని పాణ్యం అభ్యర్థి గౌరు చరిత అన్నారు. మండలంలోని భూపనపాడు గ్రామంలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ భూపనపాడులో ఎన్నో ఏళ్లుగా బీసీకాలనీ వాసులు మురుగులోనే జీవనం సాగిస్తున్నారని, డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా తయారై మురుగు బయటికి వెళ్లలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గ్రామంలో తాగునీటి సమస్య ఉందని, గతంలో టీడీపీ హయాంలో తాగునీటి సమస్య తీర్చామని గుర్తుచేశారు. గ్రామంలో తాగునీటి నిల్వకు సరైన వాటర్ ట్యాంకు నిర్మాణం చేపట్టలేదన్నారు. జగనన్న కాలనీలో ఒక సెంటు స్థలం ఇవ్వడానికి వైసీపీ ప్రయత్నించగా గ్రామస్థులు వ్యతిరేకించారని, కాలనీలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేదని అన్నారు. టీడీపీ హయాంలో రూ.3 కోట్లతో నిర్మించాల్సిన మద్దూరు రహదారి నిర్మాణం ఇంతవరకు చేపట్టలేదన్నారు. పంట రస్తాలు లేక రైతులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారన్నారు. వెయ్యి ఎకరాల ఆ ఆయకట్టు ఉన్న చెరువును రాజకీయ పలుకుబడితో ఒకే వర్గం చేపల వేలం చేపడుతోందని అన్నారు. మరమ్మతులు లేక చెరువు శిథిలావస్థకు చేరుకుందన్నారు. కల్తీ విత్తనాలతో భూపనపాడు పత్తి రైతులు నష్టాలకు గురైనా వైసీపీ ప్రభుత్వం ఆదుకోకపోవడం విచారకరమన్నారు. భూపనపాడు గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా మారుస్తామన్నారు. భూసర్వే పేరిట రైతుల భూములను అస్తవ్యస్తం చేశారన్నారు. సమగ్ర భూసర్వే పేరుతో చేసిన సర్వేతో రైతుల భూముల ఆన్‌లైన్ వివరాలు తప్పల తడకగా ఉన్నాయని, దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. సొంత భూ పట్టాలపై జగన్ ఫొటో వేసుకొని ఆ భూములను తాకట్టు పెట్టడానికి సిద్ధమయ్యారని అన్నారు. ఇందులో భాగంగానే పంటపొలాల్లోని సరిహద్దు రాళ్లపై తన ముఖ చిత్రం వేసుకొని ఆనందం పొందుతున్నారన్నారు. ఈ సందర్భంగా వైసీపీ విడుదల చేసిన ల్యాండ్ టైటిల్ యాక్ట్ జీవో ప్రతులను దహనం చేశారు. ప్రజల మేలు కోరే పార్టీని గెలిపించుకోవాలని సూచించారు. జగన్ పాలనను వదిలించుకొని టీడీపీని అధికారంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని, దీంతో అన్ని వర్గాల ప్రజలు వైసీపీని వ్యతిరేకిస్తున్నారని అన్నారు. ప్రజలు ఎన్నికల కోసం వేచి చూస్తున్నారని, కచ్చితంగా వైసీపీకి తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధి, సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని అన్నారు. ఈ సందర్భంగా మహిళలు తాగునీటి సమస్యను గౌరు చరిత దృష్టికి తీసుకొచ్చి సమస్యను పరిష్కరించాలని కోరారు. పేద, బడుగు వర్గాల అభివృద్ధి కోసమే చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను రూపొందించారని అన్నారు. తల్లికి వందనం లోభాగంగా ఇంట్లో చదివే పిల్లలందరికీ ప్రతి ఏటా రూ.15 వేలు, ఆడబిడ్డ నిధి నుంచి 18 ఏళ్లునిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 అందిస్తుంద, దీపం పథకం కింద ఏటా ప్రతి కుటుంబానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం కల్పిస్తుందన్నారు. ఐదేళ్లలో 20 లక్షల మంది యువతకు ఉపాధి, నిరుద్యోగ యువకులకు ప్రతి నెలా యువగళం నుంచి రూ.3 వేలు జీవన భృతి కింద అందజేయనున్నట్లు చెప్పారు. రైతులకు ఏటా రూ.20 వేలు ఆర్థిక సాయం అందిస్తామన్నారు. బీసీలకు రక్షణ చట్టం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇంటింటికి మంచి నీరు పథకం కింద ప్రతి ఇంటికి రక్షిత తాగు నీటి కొళాయి కనెక్షన్ ఇవ్వనున్నట్లు ప్రజలకు తెలిపారు. పేదలను సంపన్నులను చేసే కార్యక్రమం చేపట్టామన్నారు. ఐదేళ్లలో కనీసం రెట్టింపు ఆదాయం చేకూరేలా టీడీపీ మేనిఫెస్టోను రూపొందించారని చెప్పారు. ఈ మేనిఫెస్టోతోనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో జనసేన కన్వీనర్ జగదీశ్‌బాబు, టీడీపీ మండల కన్వీనర్ జయరామిరెడ్డి, రమణమూర్తి, రామ్మోహన్‌నాయుడు, సునీల్, హనుమంతు, మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తాగునీటి సమస్య తీర్చాలని గౌరు చరితను కోరుతున్న మహిళలు



రైతుల వ్యతిరేక జీవో ప్రతులను దహనం చేస్తున్న గౌరు చరిత



హాజరైన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు

మల్లన్న సన్నిధిలో కర్ణాటక హైకోర్టు జడ్జి



ఆలయ ప్రాంగణంలో న్యాయమూర్తి జస్టిస్ గురుసిద్ధయ్య బసవరాజ

శ్రీశైలం, మే 10: శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను కర్ణాటక రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ గురుసిద్ధయ్య బసవరాజ శుక్రవారం దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న జడ్జికి ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో జడ్జికి వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థప్రసాదాలను అందజేశారు.

శిల్పాకు ఓటమి తప్పదు: ఫరూక్



కానాలపల్లెలో అభివాదం చేస్తున్న ఫరూక్

గోస్పాడు, మే 10: నంద్యాల నియోజకవర్గ అభివృద్ధిని 20 సంవత్సరాల పాటు విస్మరించిన శిల్పా కుటుంబానికి ఓటమి తప్పదని టీడీపీ నంద్యాల ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. ప్రజా గళంలో భాగంగా శుక్రవారం దీబగుంట్ల, కానాలపల్లె గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నంద్యాల నియోజకవర్గంలో అభివృద్ధి జరిగిందంటే అది కేవలం తెలుగుదేశం హయాంలోనేనని అన్నారు. శిల్పా కుటుంబానికి దోచుకోవడం, దాచుకోవడం తప్ప ఏమీ తెలీయదని అన్నారు. ముస్లింల ద్రోహి జగన్‌మోహన్‌రెడ్డిని ముస్లింల కోసం కొత్తగా ఒక పథకం కూడా పెట్టకుండా ముస్లింలకు అన్యాయం చేశారని మండిపడ్డారు. మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి లాయర్ తాతిరెడ్డి తులసీరెడ్డి, మండల కన్వీనర్ తులసీశ్వరరెడ్డి, సింగిల్ విండో మాజీ ఛైర్మన్ వీరసింహారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, గోవింద భూపాల్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, హుసేని, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

'జగన్‌ను ఇంటికి సాగనంపాలి'

రాయలసీమ ద్రోహి జగన్‌ను ఇంటికి పంపాలని టీడీపీ నంద్యాల అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్, మాజీ ఎమ్మెల్యే భైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం యాళ్ళూరు గ్రామంలో రోడ్ షో నిర్వహించారు. వారు మాట్లాడుతూ నంద్యాలకు శిల్పా కుటుంబం చేసిందేమీ లేదని, వ్యాపారాలు చేస్తూ, మోసాలు చేస్తూ ప్రజల సొమ్మును దోచుకుంటున్నారని ఆరోపించారు. టీడీపీ మండల అధ్యక్షుడు తులసీశ్వరరెడ్డి, బాలీశ్వర రెడ్డి, వెంకటరెడ్డి, శంకర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రచారం

మండలంలోని గోస్పాడు, పసురుపాడు, జూలేపల్లె, చింతకుంట్ల, ఒంటివెలగల, తేళ్ళపూరి, తదితర గ్రామాల్లో టీడీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలను ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు వివరిస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50 సంవత్సరాలకు పింఛన్, ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై ప్రజలకు వివరిస్తూ టీడీపీకి ఓటు వేయాలని ప్రజలను కోరారు. ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ ద్వారం వీరారెడ్డి, సింగిల్ విండో ఛైర్మన్ వీరసింహారెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, తులసిరెడ్డి, పుండరీ కాంక్షరెడ్డి, కాటంరెడ్డి కృష్ణమోహన్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, శీలం వీరారెడ్డి, మల్లికార్జున ప్రచారం నిర్వహించారు.

'ప్రజల సమస్యలపై మాట్లాడని పోచా'



ప్రచారం చేస్తున్న లక్ష్మీనరసింహ యాదవ్

నంద్యాల టౌన్, మే 10: వైసీపీ నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి ఐదేళ్లలో ప్రజల, రైతుల సమస్యలపై ఏనాడు పార్లమెంట్‌లో మాట్లాడలేదని కాంగ్రెస్ నంద్యాల ఎంపీ అభ్యర్థి లక్ష్మీనరసింహ యాదవ్ ధ్వజమెత్తారు. నంద్యాలలోని శ్రీనివాసనగర్, నూనెపల్లె, సలీంనగర్, డేనియల్‌పురం ప్రాంతాలలో శుక్రవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ సీమకు ప్రత్యేక ప్యాకేజీ, ఏపీకి ప్రత్యేక హోదా, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు జరుగుతున్న అన్యాయాలపై, మహిళలపై దాడులపై పార్లమెంట్‌లో ఎప్పుడూ మాట్లాడలేదని అన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ వస్తే ప్రజల జీవితాల్లో వెలుగు: బుడ్డా



తిమ్మాపురంలో హాజరైన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు

మహానంది, మే 10: టీడీపీ అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలతో ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతాయని శ్రీశైల నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. మండలంలోని నందిపల్లి, అబ్బీపురం, తిమ్మాపురం గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. బుడ్డా మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవారికి, రైతులకు మధ్య జరుగుతున్న యుద్ధం అని అన్నారు. టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమని అన్నారు. వైసీపీ పాలనలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని అన్నారు. ప్రజలు తమ సమస్యలను చెబుతున్నారని, టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. టీడీపీతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని, ప్రజలకు వైసీపీని ఇంటికి పంపించడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి యశశ్విని, శ్రీనివాసరెడ్డి, మహేశ్వరరెడ్డి, మధు, నాగభూపాల్‌రెడ్డి, దస్తగిరి టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే సుపరిపాలన: శైలజమ్మ

ఆత్మకూరు: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రంలో సుపరిపాలన సాధ్యమని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి సతీమణి శైలజమ్మ అన్నారు. పట్టణంలోని పెద్దబజారులో గురువారం ఆర్యవైశ్య మహిళలతో ఆమె ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. శైలజమ్మ మాట్లాడుతూ.. ఐదేళ్ల వైసీపీ పాలనతో రాష్ట్రం అన్నివిధాలుగా సర్వనాశనమైందని అన్నారు. ఈ పరిస్థితుల్లో చంద్రబాబుతోనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుదని వివరించారు. త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన తన భర్త బుడ్డా రాజశేఖరరెడ్డి అత్యధిక మెజార్టీ గెలిపించాలని కోరారు. ఇకపోతే టీడీపీ, జనసేన ప్రవేశపెట్టిన మేనిఫెస్టోలో అన్ని వర్గాలకు తగిన ప్రాధాన్యం కల్పించినట్లు వివరించారు. అలాగే ఆర్యవైశ్య కార్పొరేషన్‌కు నిధుల కేటాయింపు, చిరు వ్యాపారులకు వడ్డీలేని రుణాలు, స్వేచ్ఛాయుత వాతావరణంలో వ్యాపారాల నిర్వహణకు చర్యలు తీసుకోవడంతో పాటు కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికార కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. డాక్టర్ బుడ్డా మేఘన, అల్లుడు సాయి జయంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అమ్మవారికి 101 టెంకాయలు

టీడీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డికి విజయం వరించేలా దీవించమ్మా అని వేడుకుంటూ ఆత్మకూరులోని 1వ వార్డుకు చెందిన టీడీపీ నాయకులు జంబులా పరమేశ్వరి అమ్మవారికి 101 టెంకాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నాయకులు శ్రీధర్‌రెడ్డి, శివరామకృష్ణ యాదవ్, విజయ్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు, భాస్కర్ పాల్గొన్నారు.

సుండిపెంటలో ర్యాలీ

శ్రీశైలం: శ్రీశైలం మండలం సుండిపెంట గ్రామంలో శుక్రవారం టీడీపి నాయకుడు యుగంధర్ రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ, బీజేపి, జనసేన నాయకులు, కార్యకర్తలు ప్రచారంలో భాగంగా భారీ ర్యాలీ నిర్వహించారు. శ్రీశైలం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డి, నంద్యాల ఎంపీ అభ్యర్థి భైరెడ్డి శబరిని గెలిపించాలని కోరారు. టీడీపీ కార్యాలయం నుంచి ప్రారంభించి ఈ ర్యాలీ కాకుల సెంటర్, బండ్ల బజార్, పూర్ణానంద ఆశ్రమం, బస్‌స్టాండ్, వెస్ట్రన్ కాలనీలో ప్రచార ర్యాలీ నిర్వహించారు.

మసీదుపురంలో ప్రచారం

మహానంది: మండలంలోని మసీదుపురం గ్రామంలో టీడీపీ నాయకులు చంద్రమౌళీశ్వరరెడ్డి, ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. టీడీపీ మేనిఫెస్టో గురించి వివరించారు. సైకిల్ గుర్తు ఓటు వేసి శ్రీశైల నియోజకవర్గం టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డిని, టీడీపీ నంద్యాల ఎంపీ అభ్యర్థి భైరెడ్డి శబరిని గెలిపించాలని కోరారు.



నందిపల్లిలో బుడ్డా రాజశేఖరరెడ్డికి తిలకం పెడుతున్న మహిళ



ఆత్మకూరులో మాట్లాడుతున్న బుడ్డా శైలజ



సుండిపెంటలో ప్రచారం చేస్తున్న నాయకులు

వైసీపీ వస్తే భూములన్నీ గల్లంతే: మాండ్ర



అల్లూరులో రోడ్ షో నిర్వహిస్తున్న మాండ్ర, జయసూర్య

నందికొట్కూరు రూరల్, మే 10: వైసీపీ అధికారంలోకి వస్తే భూములన్నీ గల్లంతవుతాయని టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. నందికొట్కూరు మండలంలోని అల్లూరు గ్రామంలో శుక్రవారం మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు టీడీపీ అభ్యర్థి గిత్తాజయసూర్య టీడీపీ శ్రేణులతో కలిసి రోడ్ షో నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈ సార్వత్రిక ఎన్నికల్లో జగన్ వస్తే రైతుల భూములకు భరోసా ఉండదని, ల్యాండ్ టైటిలింగ్ పేరుతో అందరి రైతుల భూములను లాగేసుకుంటారని అన్నారు. జగన్ ప్రవేశపెట్టి ల్యాండ్ టైటిలింగ్ చట్టం వల్ల రైతుల భూములపై వారికి సంపూర్ణ హక్కులు ఉండవని తెలిపారు. ఈ భూములపై రెవెన్యూ అధికారులకు, ప్రభుత్వానికి మాత్రమే హక్కులు ఉంటాయని అన్నారు. మీరు కేవలం అనుభవించడానికి మాత్రమే అని అన్నారు. ఈ భూములను బ్యాంకులలో తాకట్టు పెట్టడానికి రైతులు పొలం పాసు పుస్తకాలపై జగన్ ఫొటో వేసుకోవడం న్యాయమేనా? అని ప్రశ్నించారు. మీ పూర్వీకులు మీకు ఇచ్చిన పట్టా పొలాలపై వారికి ఎందుకు హక్కులు ఉంటాయన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు వస్తే ఇలాంటి దొంగ చట్టాలను తక్షణమే రద్దు చేస్తారన్నారు. కార్యక్రమంలో మాండ్ర సురేంద్ర నాథరెడ్డి, గ్రామసర్పంచ్ నాగలక్ష్మయ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మిడుతూరు: టీడీపీని గెలిపించాలని ఆ పార్టీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానంద రెడ్డి కోరారు. ఎన్నికల ప్రచారంలో బాగంగా శుక్రవారం కడుమూరు గ్రామంలో మాండ్ర శివానంద రెడ్డి సమక్షంలో, మండల కన్వీనర్ కాతా రమేష్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, ఇద్రుష్, గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో రోడ్డు షో నిర్వహించారు.కార్యక్రమంలో నందికొట్కూరు కౌన్సిలర్ జాకీర్ హుశేన్, రఘురామయ్య, రామ సుబ్బారెడ్డి, మక్బుల్, రఫీ, అబ్దుల్ రెహమాన్, బాషా తదితరులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: వైసీపీకి ఓటేస్తే మీ భూములు, స్థలాలు గల్లంతు అవుతాయని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గిత్తా జయసూర్య అన్నారు. మండలంలోని భాస్కరాపురం గ్రామంలో రోడ్ షో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతుల భూములు కొట్టేసి తనఖా నఖా పెట్టేందుకు జగన్ ల్యాండ్ టైటిలింగ్ యాక్టును తీసుకొచ్చారని అన్నారు. ఐదేళ్లలో జగన్ ఎన్నో ఆరాచకాలు, దౌర్జన్యాలు చేశారని ఆరోపించారు. వెంకటేశ్వర్లుయాదవ్, స్వామన్న, ఉసేనయ్య, సోమశేఖర్‌గౌడు, నాగిరెడ్డి పాల్గొన్నారు.

- టీడీపీ హయాంలో జూపాడుబంగ్లా మండలంలోని తంగడంచకు తీసుకొచ్చిన జైన్, అంబుజా, మెగా సీడ్ పార్కులకు వైసీపీ ప్రభుత్వం కనీస సౌకర్యాలు అందించకపోవడంతో నిరుద్యోగులకు ఉద్యోగాలు రాలేదని టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి గిత్తా జయసూర్య అన్నారు. శుక్రవారం రాత్రి జూపాడుబంగ్లాలో శంఖారావం కార్యక్రమాన్ని నిర్వహిం చారు. వారు మాట్లాడుతూ చంద్రబాబుకు ఓటేసి గెలిపిస్తే నిలిచిపోయిన పరిశ్రమలను అభివృద్ధి చేసి నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయని, రైతు కూలీలకు ప్రతిరోజు పని దొరుకుతుందని అన్నారు. నియోజకవర్గంలో రైతుల అభివృద్ధి కోసం ఎత్తిపోతల పథకాలు తీసుకొచ్చిన ఘనత చంద్రబాబుదేనన్నారు. వైసీపీ ప్రభుత్వం నందికొట్కూరు నియోజకవర్గానికి ఇచ్చిన ఒక్కహామీ కూడా నెరవేర్చలేదని ఆరోపించారు. నాయకులు వెంకటేశ్వర్లుయాదవ్, కృష్ణయ్య, మద్దూరుసుధాకర్, రవికుమార్ యాదవ్, జంగాలపెద్దన్న, బాబు, పరమేశ్వరరెడ్డి, రఘుయాదవ్, శాలుబాషా తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వస్తేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయనీ టీడీపీ నాయకులు చిన్నపుల్లారెడ్డి, రమణారెడ్డి ప్రజలకు వివరించారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా శుక్రవారం మండలంలోని లింగాపురం గ్రామంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి వారు ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెద్దరాముడు, సుంకిరెడ్డి, శేఖర్, చిట్టెన్న, పెద్దన్న, శివరాజు తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు: నందికొట్కూరు పట్టణంలో ప్రచారం చేశారు. భాస్కర్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ రబ్బాని, కౌన్సిలర్ జాకీర్, ముర్తుజావళి, షకీల్ అహ్మద్, వారి వారి వార్డుల్లో ఇంటింటి ప్రచారం చేస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు.



కడుమూరు రోడ్ షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న మాండ్ర



భాస్కరాపురంలో మాట్లాడుతున్న గిత్తా జయసూర్య



జూపాడుబంగ్లాలో మాట్లాడుతున్న మాండ్ర శివానందరెడ్డి

'నందికొట్కూరును కర్నూలు జిల్లాలో కలిపేలా కృషి'



మిడుతూరులో మాట్లాడుతున్న బైరెడ్డి

మిడుతూరు, మే 10: నందికొట్కూరు నియోజకవర్గాన్ని కర్నూలు జిల్లాలో కలిపేలా కృషి చేస్తామని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర రెడ్డి అన్నారు. శుక్రవారం మిడుతూరులో బైరెడ్డి రాజశేఖర రెడ్డి సమక్షంలో, టీడీపీ మండల కన్వీనర్ రమేష్ రెడ్డి, భగీరథ రెడ్డి, తువ్వా అయ్యపురెడ్డి అధ్యక్షతన రోడ్ షో నిర్వహించారు. వెంకటేశ్వరరెడ్డి, చంద్రారెడ్డి, శ్రీనివాసరెడ్డి, రాంబూపాల్ రెడ్డి, ఇద్రుష్, సర్వోత్తమ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లాలో మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి రోడ్ షో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీని గెలిపించాలని కోరారు. కరుణాకర్‌రెడ్డి, సైఫుద్దీన్, రషీద్‌మియ్యా, రెహమాన్, వెంకటరమణనాయుడు, శేఖర్‌రెడ్డి, వీరారెడ్డి పాల్గొన్నారు.

బొల్లవరంలో చోరీ

నందికొట్కూరు రూరల్, మే 10: నందికొట్కూరు మండలంలోని బొల్లవరం గ్రామంలో బంగారు, నగదు అపహరణకు గురైనట్లు బాధితుడు మరియదాసు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బొళ్లవరం గ్రామానికి చెందిన మరియదాసు కుటుంబంతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లారు. గురవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేకపోవడంతో దుండగలు ఇంటి తలుపు తాళాలు పగలగొట్టి, ఇంట్లోకి చొరబడి బీరువాకు ఉన్న తాళాలు కూడా పగలగొట్టారు. శుక్రవారం తెల్లవారుఝామున తలుపులు తెరిచి ఉండడంతో ఇంటి పక్కను వారు ఫోన్ చేసి విషయం చెప్పారు. తులంన్నర బంగారు, రూ 10 వేలు నగదు తీసుకెళ్లారని బ్రాహ్మణకొట్కూరు పోలీసు స్టేషన్ ఫిర్యాదు చేశామని బాధితడుడు చెప్పారు. చోరీ విషయం తమ దృష్టికి వచ్చిందని, విచారిస్తామని ఎస్ఐ నాగార్జున తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్య

నందికొట్కూరు రూరల్, మే 10: నాగటూరు పొలిమేర లోని బావిలో పడి వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్నారు. వివరాలివీ.. నందికొట్కూరు మండలంలోని కొణిదేల గ్రామానికి చెందిన బత్తుల రమణమ్మ(65) నాగటూరు పొలిమేరలోని బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. ఆమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వారు సరిగ్గా చూసుకోకపోవడం వల్ల ఆమె మనస్తాపంలో ఆత్మహత్య చేసుకున్నట్లు కోడలు రామలక్ష్మి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు నందికొట్కూరు ఎస్ఐ వెంకటరమణ తెలిపారు.

వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం

అవుకు, మే 10: వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యమని కాశీపురం టీడీపీ నాయకుడు మోట్ల రామిరెడ్డి అన్నారు. శుక్రవారం ప్రజా గళం కార్యక్రమంలో భాగంగా సుంకేసుల గ్రామంలో టీడీపీ నాయకులు చిలకల రామచంద్రారెడ్డి, మోట్ల వెంకటేశ్వర్ రెడ్డి, చౌడయ్యతో కలిసి ఇంటింటికి తిరిగి సూపర్ సిక్స్ కరపత్రాలను అందించారు. ఈ సందర్భంగా మోట్ల రామిరెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనలో గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. గత ఎన్నికల్లో కాటసాని రామిరెడ్డి ఇచ్చిన హామీలను మరిచారన్నారు.

'ఆడపడుచులను గెలిపిద్దాం'

రుద్రవరం, మే 10: టీడీపీ తరఫున పోటీ చేసిన ఆళ్లగడ్డ అభ్యర్థి భూమా అఖిలప్రియ, నంద్యాల పార్లమెంటు అభ్యర్థి బైరెడ్డి శబరిలను సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపిద్దామని మండల కన్వీనర్ రంగనాయకులు టీడీపీ నాయకులు పోలా గురుమూర్తి పిలుపునిచ్చారు. శుక్రవారం రుద్రవరంలో ఇంటింటికీ తిరిగి ఈవీఎం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కొమ్మలపాటి రాజరారావు, మండల కార్యదర్శి చంద్రశేఖర్, కృష్ణమూర్తి, దస్తగిరి, ఖాశీం, జనసేన నాయకులు డేవిడ్, లింగమయ్య తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పతనం ఖాయం: కాంగ్రెస్

డోన్(రూరల్), మే 10: సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ పతనం ఖాయమని కాంగ్రెస్ పార్టీ డోన్ అభ్యర్థి గార్లపాటి మద్దిలేటి అన్నారు. శుక్రవారం మండలం లోని చనుగొండ్ల, ఇందిరాంపల్లె, మిద్దెపల్లి, దేవరబండ గ్రామాల్లో ఇండియా కూటమి నాయకులతో కలిసి కాంగ్రెస్ అభ్యర్థి గార్లపాటి మద్దిలేటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకయ్య, నాయకులు పులిశేఖర్, నారాయణ, కాంగ్రెస్ నాయకులు జనార్దన్, శేఖర్ పాల్గొన్నారు.

పోలూరు భాస్కర్ రెడ్డి సేవలు చిరస్మరణీయం



పోలూరు భాస్కర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న పోలూరు సోదరులు, టీడీపీ కార్యకర్తలు

బేతంచెర్ల, మే 10: మాజీ జడ్పీటీసీ సభ్యుడు దివంగత పోలూరు భాస్కర్ రెడ్డి ప్రజలకు చేసిన సేవలు చిరస్మరణీయమని టీడీపీ సీనియర్ నాయకుడు పోలూరు రాఘవరావు, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్షా వలి చౌదరి అన్నారు. శుక్రవారం పట్టణంలోని పాతబస్టాండులో పోలూరు భాస్కర్ రెడ్డి మూడో వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పోలూరు శ్రీనివాసరెడ్డి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. స్థానిక పాత బస్టాండులో మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల సమన్వయ చైర్మన్ చంద్రశేఖర్, టీడీపీ నాయకులు తిరుమలేష్ చౌదరి, సమన్వయ చైర్మన్ సుధాకర్, నారాయణ స్వామి, న్యాయవాది పోలూరు హరి, కిసోర్, కొట్బాల మహేష్, యోగేంద్రబాబు, జావాజీ వెంకటేశ్వర్లు అరుణ్ కుమార్, మురళి, తెలుగు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి ఓటుతో బుద్ధి చెప్పండి

బనగానపల్లె టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్ రెడ్డి

బనగానపల్లె, మే 10: కులం, మతం పేరుతో రాజకీయాలు చేసి లబ్ధి పొందాలనుకునే వైసీపీకి బనగానపల్లె ప్రజలు ఓటు అనే ఆయుధంతో తగిన బుద్ధి చెప్పాలని బనగానపల్లె టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్ రెడ్డి పిలుపు నిచ్చారు. బనగానపల్లె మండలంలోని పలుకూరు గ్రామంలో శుక్రవారం ప్రజాగళం బహిరంగ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన బీసీకి ప్రజలు ఘన స్వాగతం పలికారు. గజమాలతో అభిమానులు సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లుగా నియంత పాలన సాగించిన జగన్‌ను తరిమికొట్టాలన్నారు. బనగానపల్లె ఎమ్మెల్యేగా కాటసాని రామిరెడ్డి ఒక్కటంటే ఒక్కటైనా అభివృద్ధి పనిచేశాడా? అని ప్రశ్నించారు. ఉన్న నీటి పథకాలను నాశనం చేశాడన్నారు. మంచినీటి ప్లాంటులను మూయించి పాపాలు చేశాడన్నారు. అలాంటి వ్యక్తులు పాలనకు పనికిరారు అన్నారు. ఈనెల 13న జరిగే పోలింగ్ రోజున సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. జగన్ వస్తే ల్యాండ్ టైటిలింగ్ చట్టం అమలులోకి తెచ్చి.. మన ఆస్తులన్నీ తాకట్టు పెడతాడని, ప్రజలు మేలుకోకపోతే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని హెచ్చరించారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే కాటసాని రామిరెడ్డి కర్నూలులో కట్టించుకున్న కొట్టానికి పారిపోవడానికి కాటసాని సిద్ధంగా ఉన్నాడని బీసీ తనదైన శైలిలో విమర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అంబాల రామకృష్ణారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ అంబాల ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

తిమ్మనాయినిపేట లిఫ్ట్ ఇరిగేషన్ ఏమైంది?: బీసీ ఇందిరమ్మ

కొలిమిగుండ్ల రూరల్: గత టీడీపీ ప్రభుత్వం 10వేల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంగా తిమ్మనాయినిపేట లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి జీవో విడుదల చేస్తే, అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం దాన్ని తుంగలో తొక్కిందని తెలుగు మహిళ నాయకురాలు బీసీ ఇందిరమ్మ విమర్శించారు. శుక్రవారం కొలిమిగుండ్ల మండలంలోని తిమ్మనాయినిపేట గ్రామంలో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం రోడ్‌షోలో ఆమె మాట్లాడుతూ కొలిమిగుండ్ల మండలంలో సాగు నీటి వనరులు లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ జనార్దనరెడ్డి ఎంతో కష్టపడి లిఫ్ట్ ఇరిగేషన్ సాధించారని, అయితే అసమర్థ ఎమ్మెల్యే దాన్ని పూర్తి చేయలేక పోయారని విమర్శించారు. టీడీపీ అధికారం చేపట్టగానే లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ప్రారంభిస్తామన్నారు. రైతులకు చేయూతగా రూ.20వేలు అందించనున్నట్లు టీడీపీ మేనిఫెస్టోలో పెట్టిందన్నారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ చంద్రకళ, గోపాల్, గిరి, చిన్నపాపోడు, సుబ్బరాయుడు, హాజీ బాషా, హరి, బాలుశెట్టి, శేషఫణి, రమేష్ పాల్గొన్నారు.



పలుకూరులో ప్రసంగిస్తున్న బీసీ జనార్దన్‌రెడ్డి

సూపర్ సిక్స్ పథకాలతో ఆర్థిక పరిపుష్టి: బీసీ క్షీరారెడ్డి

బనగానపల్లె: చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతోనే పేదలకు ఆర్థిక పరిపుష్టి లభించి వారు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని బీసీ క్షీరారెడ్డి, బీసీ మనోరమ అన్నారు. శుక్రవారం బనగానపల్లె మండలంలోని వెంకటాపురం, అవుకు మండలం రామవరం గ్రామాల్లో బీసీ జనార్దన్‌రెడ్డి కోడలు క్షీరారెడ్డి, కూతురు మనోరమ, మాధవి టీడీపీ నాయకులు వంగల పరమేశ్వరరెడ్డి, వెంకటాపురం గడ్డం నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని అన్నారు. గురువారం ఆయా గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేసి సూపర్ 6 కరపత్రాలు పంపిణీ చేసి ప్రజాగళంలో పాల్గొన్నారు. ఇంటింటి ప్రచారం చేసి చంద్రబాబు ప్రవేశపెట్టబోయే సూపర్ 6 పథకాలను గురించి క్షుణ్ణంగా ప్రజలకు వివరించారు. మహిళా శక్తిపథకం ద్వారా 18 ఏళ్లు నిండిన ప్రతి ఆడపడుచుకు నెలకు రూ.1500, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా పంపిణీ, చదువుకునే పిల్లలకు ఏడాదికి రూ.15వేలు, అన్నదాత పథకం ద్వారా రూ.20 వేలు అందించనున్నట్లు తెలిపారు.





బీసీ ఇందిరమ్మను గజమాలతో సన్మానిస్తున్న మహిళలు, వెంకటాపురంలో ప్రచారం చేస్తున్న బీసీ క్షీరారెడ్డి, బీసీ మాధవి

జగన్ దుర్మార్గపు చట్టాన్ని రద్దు చేస్తాం

డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

డోన్, మే 10: ప్రజల భూములను కొట్టేయాలన్న దుర్మార్గంతో సీఎం జగన్ తెచ్చిన భూహక్కు చట్టాన్ని టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే రద్దు చేస్తామని టీడీపీ కూటమి డోన్ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయ ఆవరణలో ల్యాండ్ టైటిలింగ్ చట్టం సంబంధించిన జీవో ప్రతులను కోట్ల ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ ప్రజల ఆస్తులను లాక్కోవడానికి 512 జీవో తీసుకువచ్చి భూహక్కు చట్టాన్ని అమలు చేశారని మండిపడ్డారు. మీ ఆస్తి.. మీది కాదని ల్యాండ్ టైటిలింగ్ ఆఫీసర్‌తో చెప్పించి భూములను కొట్టేసే కుట్రలకు జగన్ తెరలేపారన్నారు. అధికారం, డబ్బు, కండబలం ఉన్నవారే ఏ భూములనైనా లాక్కునేలా సీఎం జగన్ భూహక్కు చట్టాన్ని తీసుకువచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే ప్రజలపై అప్పులభారం మోపారని, వైసీపీకి మళ్లీ ఓటు వేస్తే ఇక ఆస్తులు మిగలవన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ టీఈ కేశవయ్యగౌడు, మర్రి గోవిందరాజు, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు, ఓబులాపురం శేషిరెడ్డి, కటారుకొండ వెంకటేశ్వరరెడ్డి, టీఈ రఘురాములు గౌడు, ఆంజనేయగౌడు, ఆలా మల్లికార్జున రెడ్డి, వెంకోబరావు, అమకతాడు గోవిందరెడ్డి పాల్గొన్నారు.

టీడీపీలోకి 500 వైసీపీ కుటుంబాలు: డోన్ పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి సమక్షంలో ఉంగరానిగుండ్ల వైసీపీ నాయకుడు చిన్నమద్ది ఆధ్వర్యంలో 500 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరాయి. సీసంగుంతల గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు రామిరెడ్డి కూడా టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ డోన్ నియోజకవర్గంలో నియంత పాలన సాగించిన మంత్రి బుగ్గనను ఇంటికి పంపించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ టీఈ కేశవయ్యగౌడు, టీడీపీ నాయకులు ఓబులాపురం శేషిరెడ్డి, కటారుకొండ వెంకటేశ్వరరెడ్డి, హరినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు



కోట్ల సమక్షంలో టీడీపీలో చేరిన ఉంగరానిగుండ్ల వైసీపీ నాయకులు

అరాచక పాలనకు అంతం తప్పదు: కోట్ల సుజాతమ్మ

బేతంచెర్ల: రాష్ట్రంలో అరాచక పాలన దౌర్జన్యాలు, దందాలు, కబ్జాలకు పాల్పడుతున్న వైసీపీ ప్రభుత్వానికి రెండు రోజుల్లో అంతం తప్పదని.. టీడీపీ నాయకులను బెదిరించే బుగ్గనను ఇంటికి పంపాలని టీడీపీ కూటమి డోన్ ఎమ్మెల్యే అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, పట్టణ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో బేతంచెర్ల-నంద్యాల రోడ్డులో ఉన్న టీడీపీ కార్యాలయం నుంచి కొత్తబస్టాండు మీదుగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, కోట్ల సుజాతమ్మ, కూతురు కోట్ల చిత్రమ్మ టీడీపీ కార్యకర్తలతో భారీ ర్యాలీగా రోడ్‌షో నిర్వహించి బహిరంగ సభను నిర్వహించారు. మాజీ ఎంపీపీ సోమశేఖర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు ప్రసన్నలక్ష్మి, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్షావలి చౌదరి, జనసేన మండలాధ్యక్షుడు చల్లా మద్దిలేటి స్వామి, టీడీపీ రాష్ట్ర క్రిస్టియన్ ప్రధాన కార్యదర్శి మేకల నాగరాజు పాల్గొని భారీ గజమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి బుగ్గనకు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు పోలూరు రాఘవరావు, తిరుమలేష్ చౌదరి, మండల సమన్వయ చైర్మన్ చంద్రశేఖర్, పట్టన సమన్వయ చైర్మన్ సుధాకర్, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.



భూ హక్కు చట్టం జీవో ప్రతులను దహనం చేస్తున్న కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు నిర్మాతలు ఓటర్లే

కోవెలకుంట్ల, మే 10: ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు నిర్మాతలు ఓటర్లే అని రాష్ట్ర టీడీపీ కార్యదర్శి గడ్డం రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన కోవెలకుంట్లలో విలేకరులతో మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ఏపీ ప్రజలు ఆలోచించి భవిష్యత్‌ను సిద్ధం చేసుకోవాలని అన్నారు. ఒక్క చాన్సు అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ కుంటి సాకులు చెబుతూ అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందించకుండా వారికి అన్యాయం చేశారన్నారు. పెట్రోల్, డీజిల్, విద్యుత్, బస్సు చార్జీలు పెంచి పేదల నడ్డివిరిచారన్నారు. సీఎంగా చంద్రబాబు ఉన్న సమయంలో ఎక్కడ కూడా అవినీతి ప రుడని విమర్శలు చేయడానికి కూడా అవకాశమివ్వకుండా 14 ఏళ్లు రాష్ట్రా న్ని పాలిం చారన్నారు. ప్రజల ఆరోగ్యంతోపాటు జీవితాలను నాశనం చేసిన దగా కోరు జగన్ అని విమర్శించారు.

గోగిశెట్టిని కలిసిన రుద్రవరం నాయకులు

రుద్రవరం, మే 10: అనంతపురం జిల్లా పెనుగొండ నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు, రాష్ట్ర కార్యదర్శి గోగిశెట్టి నరసింహారావును రుద్రవరానికి చెందిన టీడీపీ, జనసేన నాయకులు కలిశారు. పెనుగొండలో ఆయనను ఘనంగా సన్మానించారు. నాయకులు ఓబులయ్య, దస్తగిరి, సురేష్, జనసేన నాయకులు సురేష్ పాల్గొన్నారు.

పిడుగుపాటుకు 68 గొర్రెలు మృతి

బనగానపల్లె, మే 10: బనగానపల్లె మండలం నందవరం - విఠలాపురం గ్రామాల మధ్య పిడుగుపాటుకు చెట్టుకింద నిలుపుకున్న 68 గొర్రెలు మృతి చెందాయి. విషయం తెలిసిన వెంటనే శుక్రవారం బనగానపల్లె మండల టీడీపీ అధ్యక్షుడు పీవీ. కుమార్‌రెడ్డి స్పందించి ఘటనా స్థలానికి చేసుకొని బాధితులను ఓదార్చారు. బేతంచెర్లకు చెందిన సుధాకర్ అతని కుటుంబ సభ్యులు విఠలాపురం పరిసర ప్రాంతాల్లో గొర్రెలను మేపుకోవడానికి వచ్చారు. అయితే అనుకోండా గాలివానతోపాటు పిడుగు పడడంతో అక్కడికక్కడే 68 గొర్రెలు మృతి చెందాయి. దీంతో రూ.7 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు సుధాకర్ వాపోయారు.

'వాహనదారులు అప్రమత్తంగా ఉండాలి'

రుద్రవరం, మే 10: రుద్రవరం ఫారెస్టు సబ్ డివిజను చెలిమరేంజ్ పరిధిలో నంద్యాల - ఒంగోలు రహదారి వెంట చిరుతపులులు, ఎలుగుబంట్లు సంచరిస్తున్నాయని, వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని రేంజర్ ఈశ్వరయ్య సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులపై మార్గమధ్యంలో దాడి చేసే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. సాయంత్రం 6గంటల నుంచి ఉదయం 6 వరకు ద్విచక్ర వాహనదారులు ప్రయాణించరాదని రేంజర్ సూచించారు.

'కూటమి అభ్యర్థులకే ఎమ్మార్పీఎస్ మద్దతు'

రుద్రవరం, మే 10: జిల్లాలో కూటమికే తమ మద్దతు ఇస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు రామాంజనేయులు, పేరూరు బాలరాజు తెలిపారు. మండలంలోని పేరూరు గ్రామంలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రచారం చేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందక్రిష్ణ ఆదేశాల మేరకు కూటమి అభ్యర్థులైన నంద్యాల పార్లమెంటు అభ్యర్థి బైరెడ్డి శబరి, ఆళ్లగడ్డ టీడీపీ అభ్యర్థి భూమా అఖిలప్రియలను గెలిపించాలని కోరారు. ఎంఎస్‌పీ మండల ఉపాధ్యక్షుడు బొగ్గుల బాలరాజు, జయన్న, నారాయణ, బాలావృద్ధీ పాల్గొన్నారు.

ఘనంగా బసవేశ్వర జయంతి

చాగలమర్రి, మే 10: మండల కేంద్రంలోని బసవన్న కట్ట వద్ద శుక్రవారం బసవేశ్వర జయంతిని వీరశైవ లింగ యూత్ సభ్యులు ఘనంగా నిర్వహించారు. బసవేశ్వరుడికి స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు, రహదారి వెంట వెళ్లే ప్రజలకు మజ్జిగ, తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు మనోహర్, అమరేష్, ప్రసాద్, రమేష్, మల్లి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డలో వైసీపీ ఓటమి ఖాయం : అఖిలప్రియ

నంద్యాల, మే 10(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డలో టీడీపీ ప్రభంజనానికి వైసీపీ కొట్టుకుపోవడం ఖాయమని మాజీ మంత్రి అఖిలప్రియ అన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలో శుక్రవారం రోడ్డు షో నిర్వహించారు. ఆళ్లగడ్డ పాత బస్టాండులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో తాను తెచ్చిన 50 పడకల వైద్యశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలను అధికార వైసీపీ వారు తెచ్చామని అబద్ధాలు చెప్పుకోవడం దారుణమన్నారు. తాను ప్రజల కోసం పోరాటం చేస్తుంటే తప్పుడు కేసుల పెట్టి తనపై కేసులున్నట్లు ప్రచారం చేస్తు న్నారని అన్నారు. గంగుల ప్రభాకరరెడ్డిపై, ఆయన అల్లుడిపై కేసులు ఉన్నా యని, ఇలా చెప్పుకుంటూ పోతే చాలా ఉన్నాయని అన్నారు. టీడీపీ గెలిస్తే రెండు అన్నా క్యాంటీన్లు, మూడు ఆటో స్టాండ్లు, బాలిరెడ్డి ఇండోర్ స్టేడియం, షాదీఖానా అభివృద్ధి చేపడతామని చెప్పారు. మున్సిపాలిటీకి పన్నులు కట్టకుండా చేస్తానని, ఆళ్లగడ్డలో మూడు పరిశ్రమలు ఏర్పాటు చేసి 5 వేల మంది యువతకు ఉద్యోగాలు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. నంద్యాల ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి, జనసేన పార్టీ ఇన్‌చార్జి ఇరిగెల రాంపుల్లారెడ్డి, భూమా విఖ్యాత్‌రెడ్డి, కాటన్‌బోర్డు మాజీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి(వాసు), ఎస్వీ ప్రసా దరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని ఇంటికి పంపడం ఖాయం

ఉయ్యాలవాడ: వైసీపీని ప్రజలు ఇంటికి పంపడం ఖాయమని టీడీపీ ఆళ్లగడ్డ అభ్యర్థి భూమా అఖిలప్రియ తెలిపారు. శుక్రవారం ఆర్.పాంపల్లె గ్రామంలో జనసేన పార్టీ ఇన్‌చార్జి ఇరిగెల రాంపుల్లారెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. అఖిలప్రియ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సైకిల్ గుర్తుపై ఓటు వేసి అరాచక పాలనను అంతమొందించాలని పిలుపునిచ్చారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని, మరోసారి అవకాశం ఇస్తే రైతుల భూములను తాకట్టు పెట్టి భూములను మింగేస్తారని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో రైతులు, వృద్ధులు, మహిళలు, యువత ప్రతి ఒక్కరూ మోసపోయారన్నారు. టీడీపీ మేనిఫెస్టోతో పేదలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే భూ హక్కు చట్టాన్ని రద్దు చేస్తారన్నారు. రైతుల విద్యుత్ మోటార్లకు మీటర్లు ఏర్పాటు చేసి రైతుల మెడకు ఉచ్చి బిగిస్తే ప్రయత్నం వైసీపీ ప్రభుత్వం చేస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, చంద్రశేఖర్‌యాదవ్, నారాయణయాదవ్, వెంకటేశ్వరరెడ్డి, శేఖర్‌రెడ్డి, నారాయణరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, బాబుల్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, రమేష్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

'చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి'

చాగలమర్రి: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ ఆళ్లగడ్డ అభ్యర్థి భూమా అఖిలప్రియ అన్నారు. శుక్రవారం నేలంపాడు గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు చిన్న పకృద్దీన్, ఉసేన్‌వలి, అబ్దుల్‌రెహమాన్, మాబు షరీఫ్, మహబూబ్‌పీరాతో పాటు మరో 40 కుటుంబాలు టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భూమా అఖిలప్రియ

ఓటరు చూపు టీడీపీ వైపే: భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి

రుద్రవరం: ఓటరు చూపు టీడీపీ వైపే ఉందని ఆ పార్టీ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఆలమూరు గ్రామంలో శుక్రవారం ప్రజాగళం యాత్రలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ అవినీతికి ఓటు వేయవద్దు, అభివృద్ధికి ఓటు వేద్దాం అని పిలుపునిచ్చారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఆళ్లగడ్డలో అభివృద్ధి శూన్యమని ఆరోపించారు. టీడీపీని గెలిపించాలని కోరారు. నారాయణ, సత్యనారాయణ, బ్రహ్మయ్య, ముళ్లరాజా, మాజీ ఎంపీటీసీ ఖాదర్‌హుసేన్, శివ తదితరులు పాల్గొన్నారు.

'వైసీపీకి రోజులు దగ్గరపడ్డాయి'

చాగలమర్రి: రాష్ట్రంలో వైసీపీకి రోజులు దగ్గరపడ్డాయని టీడీపీ నాయకుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డి అన్నారు. మండంలంలోని మల్లేవేముల, రాజోలి గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్-6 పథకాల గురించి ప్రజలకు వివరించారు. టీడీపీ అభ్యర్థి భూమా అఖిలప్రియకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. ఎన్నికల్లో వైసీపీకి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు.మాజీ ఎంపీపీ నాగమ్మ, టీడీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, నాయకులు ప్రతాప్‌రెడ్డి, జమాల్‌రెడ్డి, శంకరయ్య, శేఖర్‌రెడ్డి, పుల్లయ్య, నడిపి ఓబయ్య, నరసింహుడు, బ్రహ్మానందరెడ్డి, నర్సిరెడ్డి, కె.ఓబయ్య, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.





నేలంపాడులో అఖిలప్రియ సమక్షంలో చేరిన వైసీపీ నాయకులు, ఆలమూరులో మాట్లాడుతున్న భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి

ఎన్నికల్లో గొడవలకు పాల్పడితే చర్యలు

కోవెలకుంట్ల, మే 10: ఎన్నికల్లో గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కోవెలకుంట్ల సీఐ జయచంద్ర హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని కలుగొట్ల, కంపమల్ల గ్రామాల్లో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. అనంతరం ఆయన గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ఈనెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో రేవనూరు ఎస్ఐలు రామ్మోహన్‌రెడ్డి, కోవెలకుంట్ల ఎస్ఐ వరప్రసాద్ రిజర్వు ఫోర్స్ సీఐ అరుణ్‌కుమార్ రావు, పోలీసులు పాల్గొన్నారు.

ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి

బేతంచెర్ల, మే 10: ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని బేతంచెర్ల సీఐ ప్రియతమ్ రెడ్డి తెలిపారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పట్టణంలో కేంద్ర బలగాలతోపాటు పోలీసులు కవాతు నిర్వహించారు. ఎస్ఐ శివశంకర్ నాయక్, ఆర్పీఎఫ్ దళాలు, పోలీసులు పాల్గొన్నారు.